

సాగర తీరాన కోలాహలం

గణేశ్ ఉత్సవాల ఆరో రోజు బుధవారం ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలు కొనసాగాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి చిన్న విగ్రహాలు ఎక్కువగా వచ్చాయి. ఊరేగింపుల్లో యువత, పిల్లల ఆటపాటలతో హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది.

ఈనాడు హైదరాబాద్

HMDA

గురువారం 31 ఆగస్టు 2017 — 24 పేజీలు



గ్రహాలపై కనిపించే గుంతలు కాదు... ఎల్బీనగర్ చింతలకుంట వద్ద జాతీయ రహదారిపై గోతులు

గుంతలే... జేబులు నింపుతున్నాయ్!

- రహదారి మరమ్మతుల్లో మాయాజాలం
- నాణ్యత లేని పనులతో రోడ్లు మరింత అధ్వానం
- నరకం చూస్తోన్న గ్రేటర్‌వాసులు

ఈనాడు, హైదరాబాద్

● ఎల్‌బీనగర్ చింతలకుంట వద్ద ఇటీవల వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. బాగు చేయాల్సిన అధికారులు.. మరింత అధ్వానంగా మార్చేలా మరమ్మతులు చేపట్టారు. గుంతల్లో నాణ్యతలేని కంకర, సిమెంట్, స్టోన్ డస్టుతో కూడిన మిశ్రమాన్ని నింపేసి వెళ్లిపోయారు. తారు అందుబాటులో లేకపోతే కనీసం ఆ మిశ్రమంపై రోలర్‌నైనా తిప్పాలి. లేనిపక్షంలో చిన్న వర్షం వచ్చినా ఆప్రాంతం మొత్తం బురద బురదగా తయారై వాహనాల రాకపోకలకు అవస్థలు రెట్టింపవుతాయి.

● రాణిగంజ్ బస్టాపు వద్ద గుంతలమయంగా ఉన్న సిమెంటు రోడ్డుకు సిబ్బంది చేసిన మరమ్మతులు విస్మయానికి గురిచేసేలా ఉన్నాయి. ట్రక్కులోని పొడిపొడిగా ఉన్న ఇసుక, కంకర, సిమెంటు, రాక్‌శాండ్ మిశ్రమాన్ని తట్టల్లో నింపారు. గుంతల్లో ఆ మిశ్రమాన్ని పోసి... కాళ్లతో చదును చేసి వెళ్లిపోవడాన్ని చూసి స్థానికులే అవాక్కవాల్సి వచ్చింది. మరమ్మతులు ఇలాగేనా అని ప్రశ్నిస్తే.. చదును చేసిన చోట నీళ్లు చల్లి తాపీతో సమం చేసి వెళ్లారు. ఈ తరహా మరమ్మతులతో నిధుల దుర్వినియోగం తప్ప ప్రయోజనం ఉండదు.

నగరంలో రహదారి మరమ్మతులు అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారాయి. కొందరు అధికారులు, గుత్తేదారుల వైఖరి రోడ్డుపై గుంతలు పడితేనే తమ జేబులు నిండుతాయనేలా తయారైంది. జరుగుతున్న పనులను గమనిస్తే... కాస్త దెబ్బతిన్న రోడ్డును పూర్తిగా ధ్వంసం చేసేలా ఉంటున్నాయి. జీహెచ్ఎంసీ గుంతలు పూడ్చిందనే ఆనందం.. వాహనదారుల్లో రెండ్రోజులు కూడా నిలవట్లేదు. 24 గంటలు గడవక ముందే అదే ప్రాంతంలో అంతకన్నా పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. నాసిరకం పనులతో నగరవాసులు నిత్యం నరకం చూస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది.

బల్దియా అధికారులు రహదారి మరమ్మతులను గాలికొదిలేశారు. కొత్త రోడ్లు వేయడం, పైవంతెనలు నిర్మించడమే తమ బాధ్యత అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన జీవనాన్ని అందిస్తామని ఉత్తుత్తి ప్రకటనలు చేస్తున్నారనే విమర్శలు ...మిగతా 4లో



చింతలకుంట వద్ద బుధవారం మరమ్మతులు ఇలా...

గ్రేటర్‌లో రహదారుల పొడవు	గతేడాది జులై నుంచి ఇప్పటి వరకు పడిన గుంతలు	గత వారం రోజుల్లో ఏర్పడ్డ గుంతలు..	గుంతలు పూడ్చేందుకు ఏడాదికి వ్యయం
9,100 కి.మీ	1.2 లక్షలు	2 వేలకు పైనే	రూ.20 కోట్లు

తారల సందడి



నటి తాప్సీ వైవిధ్యమైన ఆహార్యంతో అలరించారు. బుధవారం బంజారాహిల్స్‌లో ఓ వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడికొచ్చిన వారితో సరదాగా కబుర్లాడారు.



నటి లావణ్య త్రిపాఠి బుధవారం కేపీహెచ్‌బీలోని మంజీరామాల్‌లో మట్టి గణపతిని పూజించారు. ఇక్కడ నిర్వహించిన సంగీత విభావరిలో సందడి చేశారు.

పెంచిన నీటి ట్యాంకర్ల
ధరల తగ్గింపు

- గృహ ట్యాంకర్ల పెంపు రూ.100కు పరిమితం

హైదరాబాద్: నీటి ట్యాంకర్ల కొత్త ధరలపై జలమండలి వెనక్కి తగ్గింది. గృహావసరాలకు వాడే అయిదు వేల లీటర్ల ట్యాంకర్ ధర ఇటీవల రూ.200 పెంచుతూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అపార్ట్‌మెంటు వాసులతో పాటు సామాన్యుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పెంపుపై అధికారులు పునరాలోచనలో పడ్డారు. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకొని ట్యాంకర్ల ధరలు తగ్గించాలని ఎండీ దానకిషోర్‌ను ఆదేశించారు. దీంతో పెంచిన ఛార్జీలను కొంతమేర తగ్గిస్తున్నట్లు బుధవారం జలమండలి ప్రకటించింది. గృహావసర ట్యాంకర్ పెంపును రూ.100కు పరిమితం చేస్తున్నట్లు తెలిపింది. వాణిజ్య ట్యాంకర్ల ధరల తగ్గుదల కంటి తుడుపు చర్యగానే ఉంది. కొత్త ధరలు సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

కొత్త ధరలు ఇలా... (రూపాయల్లో..)

కేటగిరి	సామర్థ్యం (లీటర్లు)	పాతధర	ఇటీవల పెంచిన ధర	ప్రస్తుతం సవరించిన ధర
గృహావసర	5 వేలు	400	600	500
	10 వేలు	800	1,150	1,000
వాణిజ్య....	5 వేలు	700	900	850
	10 వేలు	1,400	1,750	1,700
	20 వేలు	2,800	3,500	3,400

నగరంలోనూ 'డేరా' బాబాలు!



- భూత వైద్యులుగా అవతారాలు.. మోసాలు
- మూఢనమ్మకాలే పెట్టుబడి.. విద్యావంతులూ బాధితులే
- అవగాహన పెంచేందుకు పోలీసుల యత్నాలు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే – కేశవగిరి

మంత్రించిన తైలం పూస్తే మగబిడ్డలు.. నిమ్మ రసం పూస్తే వదిలిపోయే దయ్యాలు.. గట్టిగా ఒక్క మాట చెబితే గుట్టుగా ఇంట్లోకి వచ్చే ధనరాశులు.. గవ్వలు వేస్తే పారిపోయే జబ్బులు.. ఇవన్నీ దశాబ్దాలు, శతాబ్దాల క్రితం ఉండేవనుకుంటున్నారా? కాదు.. ఈ మూఢనమ్మకాలు ఇప్పుడూ ఉన్నాయ్. రాజధాని నగరంలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయ్. దెయ్యాలు, భూతాలు లేవని తెలిసినా మానసిక బలహీనతలతో బాబాలు, భూతవైద్యులను ఆశ్రయిస్తున్నారు. బాధితుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు 'బాబా'లుగా వెలిగిపోతున్నారు. మంత్రాల పేరుతో మాయగాళ్లు ప్రజల మూఢవిశ్వాసాలను సొమ్ము చేసుకుంటున్నారు. అతీత శక్తులున్నాయని నమ్మిస్తూ బాబాల అవతారం ఎత్తుతున్నారు. పాతబస్తీలో భూతవైద్యులు, బాబాలు 'బ్లాక్ మాజిక్'తో ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అయినా ప్రజల్లో మూఢనమ్మకాలు పాతుకుపోయినంత కాలం ఎంత అవగాహన కల్పించినా ఫలితం ఉండదంటున్నారు.

కేబుల్ ఛానళ్లు, పత్రికల్లో బహిరంగ ప్రకటనలు

నగరంలోని వివిధ ప్రాంతాలతోపాటు పాతబస్తీలో విరివిగా నడిచే కేబుల్ ఛానళ్లలో, పత్రికల్లో భూతవైద్యులు ప్రచారం నిర్వహిస్తున్నారు. నేను ఫలానా భూతవైద్యుడి వద్దకు వెళ్లాను.. నా సమస్యలు పరిష్కారమవుతున్నాయంటూ కొందరితో చెప్పిస్తున్నారు. ఏ సమస్య అయినా పరిష్కరిస్తామని బాబాలు 'ఓపెన్ ఛాలెంజ్' విసురుతున్నా పట్టించుకునేవారే లేరు. ఇక వారి గదుల్లో అధ్యాత్మికతను



పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు

వ్యక్తం చేసే వివిధ రకాల ఫొటోలు, మత చిహ్నాలు, పురాతనమైన ముళ్ల కట్టెలు, నిమ్మకాయలు, జీడి, మేకులు, ఎరుపురంగు వస్త్రాలు, ఏవో అక్షరాలు సారిన కాగితాలు, వాటితో రూపొందించిన తాయెత్తులు, మంత్రించిన అత్తర్లు, ఊదు, గది గోడలపై ఉర్దూ అక్షరాలు, చిత్రించిన తల్వార్లు తదితరాలతో అలంకరించిన బాబాల గదులు అక్కడికి వచ్చే బాధితులను ప్రలోభ పెట్టేవిగా ఉంటాయి. రకరకాల ప్రయోగాలు, మాయమాటలతో ఆత్మలు ఆవహించాయని, దీనికోసం నివారణ చర్యలు చేయాల్సి ఉంటుందని చెబుతారు. ఇందుకోసం వేలాది రూపాయలను వసూలు చేస్తారు. వీటికోసం మూడు నుంచి ఏడు వారాలపాటు సమయం కేటాయించి వరుసగా డబ్బు దండుకుంటారు.

మంత్రాలతోపాటు నాటు వైద్యం

కొందరు భూతవైద్యులు మంత్ర తంత్రాలు, భూత వైద్యంతోపాటు నాటు మందులను ఇస్తూ వివిధ వ్యాధులను నయం చేస్తామని వైద్యులుగా అవతారం ఎత్తుతున్నారు. మంత్రతంత్రాలు, నాటు వైద్యం పేరిట మహిళలు, యువతులను లోబర్చుకుని వారిపై అఘాయిత్యాలకు పాల్పడిన ఘటనలు, కూతురి వరసైన యువతులను నిఖా చేసుకున్న ఉదంతాలూ ఉన్నాయి.

పాతబస్తీతోపాటు నగరం, శివార్లలో బాబాలపై కేసులు పెడుతున్నా మళ్లీ కొత్తవారు పుట్టుకొస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించే మార్గం కావడంతో పలువురు ఈ మాయ వృత్తిలోకి వలస వస్తున్నారు. ముఖ్యంగా పేద ప్రజలు నివసించే ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. బండ్లగూడ, జహంగీరాబాద్, ఇస్మాయిల్‌నగర్, నూరీనగర్, గౌస్‌నగర్, వట్టేపల్లి, యాఖుత్‌పురా ప్రాంతాలలో బాబాల ప్రభావం అధికంగా ఉంది.

ఇదే సుఖం.. ఆదాయం..

- వైద్యవృత్తిలో లాభాలు రావడం లేదని వట్టేపల్లికి చెందిన ఆయుర్వేద డాక్టర్ మహ్మద్ ఖమర్ పర్వేజ్ (36) బండ్లగూడ గౌస్‌నగర్‌లో ఓ గది అద్దెకు తీసుకుని మంత్రాల దందా ప్రారంభించగా 2016 మార్చిలో చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్టు చేశారు.
- మందులు, భూతవైద్యంతో 6 నెలల్లో ఎయిడ్స్ రోగాన్ని నయం చేస్తానని నమ్మించి రెండున్నర లక్షల రూపాయలు దండుకోవడమే కాకుండా ఓ యువకుడి మృతికి కారణమైన జంగమ్మెట్‌కు చెందిన ఆమిర్ బాబాను చాంద్రాయణగుట్ట పోలీసులు 2016 మార్చిలో అరెస్టు చేశారు.
- గత ఏడాది చివరలో సుల్తాన్‌షాహిలో మంత్రాల పేరుతో అమాయక ప్రజల నుంచి లక్షలాది రూపాయలు దండుకున్న నాగిన్ అనే మహిళను మొగల్‌పురా పోలీసులు అరెస్టు చేశారు.
- నాటు వైద్యం, మంత్రాలతో థైరాయిడ్ సమస్యను నయం చేస్తానని ఓ ముస్లిం యువతిని లోబర్చుకుని నిఖా చేసుకున్న నకిలీ బాబా సయ్యద్ అబ్బాస్ పీర్ ఖాద్రీ (65)ని ఈ ఏడాది మార్చిలో చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్టు చేశారు.
- పట్టిన దయ్యాన్ని వదిలిస్తానని కాళ్లకు వాతలు పెట్టి, కళ్లలో నిమ్మరసం పిండి ఓ ఎన్నారైను, చిత్రహింసలు పెట్టిన మౌలానా షేక్ మొహసిన్ షా ఖాద్రీని తాజాగా చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్టు చేశారు.





తమకు మంత్రాలు వచ్చని నమ్మించడానికి ఉపయోగించే సామగ్రి

ఫేస్‌బుక్ పరిచయంతో యువతికి బెదిరింపులు

ఇద్దరు యువకుల అరెస్ట్.. రిమాండ్



నిందితులు వినయ్, ప్రవీణ్

సైదాబాద్, న్యూస్‌టుడే: ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ యువతిని ఇద్దరు యువకులు డబ్బుల కోసం వేధించారు. ఆమెను బెదిరించి బంగారు గొలుసు లాక్కున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో మలక్‌పేట పోలీసులు యువకులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. డీఐ గుజ్జ రమేష్ వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన యువతి (18) బీటెక్ చదువుతోంది. ఫేస్‌బుక్ ద్వారా ఈనెల 5న కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి హవేలీ ప్రాంతానికి చెందిన బీటెక్ చదివిన శ్రీపతి వినయ్‌కుమర్ (21), ఎంసీఏ చదివిన ఎన్నంపల్లి ప్రవీణ్ (27)తో పరిచయం ఏర్పడింది. చాటింగ్‌లో రూ.10 వేలు కావాలన్నారు. యువతి నిరాకరించడంతో ఫొటో మార్ఫింగ్ చేస్తామంటూ బెదిరించారు. ఇద్దరూ హైదరాబాద్‌కు రాగా యువతి కలిసినప్పుడు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. ఇటీవల తిరిగి రూ.50 వేలు కావాలంటూ మళ్లీ బెదిరించడం ప్రారంభించారు. దీంతో యువతి కుటుంబసభ్యులకు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎంజీబీఎస్‌లో బుధవారం ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి గొలుసు స్వాధీనం చేశారు.

మృత్యుపాశమైన వాహనం

చెత్తను తరలించే ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

గోల్నాక, న్యూస్‌టుడే: జీహెచ్ఎంసీ చెత్తను తరలించే ట్రాలీ ఆటో ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన అంబర్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్ కథనం ప్రకారం.. రామంతాపూర్ కామాక్షిపురంలో నివసించే చెన్నారెడ్డి (65) హోటల్ కార్మికుడు. మంగళవారం మధ్యాహ్నం కోఠిలో సోదరుడిని కలుసుకోవడానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు. ఆరోనెంబర్ చౌరస్తాలో వెనుక నుంచి వచ్చిన ఆటో ట్రాలీ ఢీకొట్టింది. 108లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. చెన్నారెడ్డి కుమారుడు సంపత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాహనంలో తెస్తున్న 60 చరవాణులు మాయం

కాచిగూడ, న్యూస్‌టుడే: మొబైల్ దుకాణాలకు సరఫరా చేయడానికి వాహనంలో తెస్తున్న 60 కొత్త చరవాణులు మాయమైన సంఘటన కాచిగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. మల్కాజ్‌గిరిలో నివాసం ఉండే ఫణికుమార్ (42) మియాపూర్ కేంద్రంగా ఎంఐ బ్రాండ్ చరవాణులను మొబైల్స్ దుకాణాలకు సరఫరా చేస్తుంటాడు. ఒక్కో పెట్టెలో 20 ఉంటాయి. మొత్తం 66 పెట్టెలను వాహనంలో మియాపూర్ నుంచి కాచిగూడలోని సంగీత మొబైల్స్ దుకాణానికి మంగళవారం రాత్రి పంపించాడు. వాహనంలోని 60 చరవాణులు ఉన్న 3 పెట్టెలు మాయమవగా ఫణికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తుతెలియని వాహనంతో కలకలం



వాహనం వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి రక్తనిధి కేంద్రం వద్ద బుధవారం ఒక్కసారిగా కలకలం చోటుచేసుకొంది. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందం అక్కడికి రావడంతో అక్కడేం జరిగిందో అర్థం కాక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. జూబ్లీహిల్స్ రోడ్డు నం.1లోని చిరంజీవి రక్త నిధి కేంద్రం ఎదుట పది రోజులుగా తమిళనాడు రిజిస్ట్రేషన్‌తో కూడిన ద్విచక్రవాహనం నిలిపి ఉంది. రక్త నిధి కేంద్రం సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఐ ముత్తుతోపాటు సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ అధికారి రమేష్ అక్కడికి చేరుకున్నారు. ప్రత్యేక జాగిలాలతో తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదం లేదని భావించిన పోలీసులు వాహనాన్ని అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నంబరు ప్లేటు సరిగా లేకపోవడం వల్ల ఇంజిన్ నంబరును రవాణా శాఖ అధికారులకు పంపారు. చోరీ చేసి తెచ్చి ఇక్కడ వదిలేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

బాలికపై యువకుడి అత్యాచారం

దుండిగల్: మాయమాటలతో బాలికను నమ్మించి ఓ యువకుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. దుండిగల్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం సూరారం కాలనీకి చెందిన మహేష్ ఓ రెస్టారెంట్‌లో వంటమనిషిగా పనిచేస్తున్నాడు. అతని నివాసం ఎదురుగా బాలిక (13) కుటుంబం ఉంటోంది. మంగళవారం ఉదయం మహేష్ బాలికను మాటల్లోకి దింపి తన గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలికస్థితిపై అనుమానం వచ్చిన తల్లిదండ్రులు ఆమెను నిలదీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

విలాసాల కోసం దొంగతనాలు



చోరీల నిందితులు

రెజిమెంటల్‌బజార్: జల్సాలకు అలవాటు పడిన యువకులు రాత్రిపూట ద్విచక్రవాహనాలపై తిరుగుతూ నిర్మానుష్యంగా ఉండే ప్రదేశంలో ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులపై దాడులు చేసి చోరీలకు పాల్పడుతున్న నలుగురిలో ఇద్దరిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. ఒక ద్విచక్రవాహనంతో పాటు రూ.2 వేల నగదు, 5 చరవాణులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. డీసీపీ సుమతి, బేగంపేట ఏసీపీ ఎస్.రంగరావు, ఇన్‌స్పెక్టర్లు జగన్, జి.రాజు.. వివరాలు తెలిపారు. ఈస్ట్‌మారేడుపల్లి టీచర్స్ కాలనీకి చెందిన టమాట సంజయ్ సింగ్ అలియాస్ కమార్ (18) రైల్వే ప్రయాణికుల మెడల్లోని గొలుసులను చోరీ చేస్తూ విలాసాలకు అలవాటయ్యాడు. మౌలాలి వెంకటేశ్వర నగర్‌కు చెందిన మనీష్ ఉపాధ్యాయ (18), మల్కాజిగిరి వెంకటేశ్వరనగర్‌కు చెందిన గోర్నకొండ నిఖిల్, అలియాస్ చిన్నా (19), మార్క అరుణ్ కుమార్ (19)తో స్నేహం పెరిగి డబ్బు అవసరాలకు ద్విచక్ర వాహనాలపై తెల్లవారుజాము వరకు సికింద్రాబాద్, కంటోన్మెంట్, నల్లకుంట, బేగంపేట, మహంకాళి, మారేడుపల్లి ప్రాంతాల్లో తిరుగుతూ ఒంటరి వ్యక్తులపై దాడులు చేస్తూ దోచుకుంటున్నారు. బ్రూక్‌బాండ్ చౌరస్తా వద్ద ఆగస్టు 18న నాగోల్‌కు చెందిన నిఖిల్‌ను కొట్టి రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు నిఘా పెట్టి దర్యాప్తు చేపట్టారు. ఆగస్టు 30 బుధవారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనాలపై వస్తున్న సంజయ్‌సింగ్, మనీష్ ఉపాధ్యాయలను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు.



నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడమే నేరం. అలాంటిది ఈ వాహనంపై నలుగురు వెళ్తున్నారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్ పక్కనుంచి వీరు ఇలా వెళ్తుండగా కెమేరా 'క్లిక్'మనిపించింది

బిలబిలా మంజీరా పలకరిస్తుంటేను!

- మళ్లీ నగరంలో గలగలలు
- రోజూ 120 ఎంజీడీల వరకు సరఫరా
- కృష్ణా నుంచి 90 ఎంజీడీలు కోత



ఈనాడు, హైదరాబాద్

భాగ్యనగరానికి మంజీరా నీటికి తరతరాల అనుబంధం ఉంది. నగరవాసుల గొంతు తడపడంలో ఈ నీటి తర్వాతే ఏదైనా. గత కొన్నాళ్లుగా చాటేసిన ఈ జలాలు ఇప్పుడు మళ్లీ పలకరించబోతున్నాయి. నాగార్జున్‌సాగర్‌లో నిల్వలు తగ్గిన నేపథ్యంలో మంజీరా జలాలను వినియోగించుకోవడానికి ప్రభుత్వం తాజాగా అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచే సరఫరా మొదలైంది. ఇక నుంచి నిత్యం 120 ఎంజీడీల వరకు మంజీరా, సింగూరు డ్యాంల నుంచి నాలుగు ఫేజ్‌లలో నగరానికి తీసుకురానున్నారు. మరోవైపు కృష్ణా నుంచి తెచ్చే జలాల్లో 90 ఎంజీడీల వరకు కోత పడింది. నల్గొండ జిల్లా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆ నీటిని అటు వైపు తరలిస్తారు. ప్రస్తుతం కృష్ణా మూడు దశల నుంచి 270 ఎంజీడీల వరకు హైదరాబాద్‌కు సరఫరా ఇస్తున్నారు. ఇక నుంచి 180 ఎంజీడీలు మాత్రమే మనకొస్తాయి. గతంలో కృష్ణాతోపాటు మంజీరా, సింగూరు నాలుగు ఫేజ్‌లు, జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నుంచి నీటిని సరఫరా చేసే వారు. 2016లో గోదావరి ప్రాజెక్టు ప్రారంభమైంది. మొత్తం 172 ఎంజీడీలకు గాను ప్రస్తుతం గోదావరి నుంచి 114 ఎంజీడీల వరకు తీసుకొస్తున్నారు. మిషన్ భగీరథతోపాటు స్థానిక సాగునీటి అవసరాలకు కేటాయించాలన్న ఉద్దేశంతో గతయేడాది నుంచి మంజీరా నీళ్లు ఆగిపోయాయి. ఇప్పుడు మళ్లీ సరఫరా ప్రారంభం కావడంతో చాలా ప్రాంతాలకు సాంత్వన లభించినట్లయింది.

సరఫరా సమస్య ఉండదు... ఇన్నాళ్లూ మంజీరా నీళ్లు రాకపోవడంతో మాదాపూర్, హైటెక్ సిటీ, కొండాపూర్ తదితర ఐటీ కారిడార్‌కు కృష్ణా నీటినే అందిస్తూ వస్తున్నారు. రివర్స్ పంపింగ్ కారణంగా శివారు కాలనీలకు పూర్తి ఒత్తిడితో సరఫరా కావడం లేదు. తరచూ పైపులు పగిలి అంతరాయం ఏర్పడేది. ఇకపై నేరుగా మంజీరా నీరు లింగంపల్లి రిజర్వాయర్‌లోకి రానున్నందున సరఫరాలో సమస్య ఉండదని అధికారులు చెబుతున్నారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చాలావరకు ప్రయోజనకరమే.


విద్యుత్తు ఛార్జీల్లో వెసులుబాటు... నీటి శుద్ధితోపాటు నగరానికి తరలించడానికి జలమండలి వేయి లీటర్ల నీటికి రూ.47 ఖర్చు చేస్తోంది. సింహభాగం విద్యుత్తు ఛార్జీల రూపేణా బోర్డుపై భారం పడుతోంది. ప్రస్తుతం నెలకు రూ.65 కోట్ల వరకు బిల్లులు చెల్లిస్తున్నారు. ఛార్జీలు పెరిగిన ప్రతీసారి రూ.4నుంచి 5కోట్లు భారం తప్పడంలేదు. అదీగాక కృష్ణా, గోదావరి జలాలను రెండు, మూడు దశల్లో తరలించడం వల్ల ఎక్కువ విద్యుత్తు వినియోగమవుతోంది. మంజీరా, సింగూరుకు ఆ పరిస్థితి తక్కువ. చాలా వరకు గురుత్వత్వరణం(గ్రావెటీ) ఆధారంగా ఈ నీటిని భాగ్యనగరానికి సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు బిల్లులు కొంతవరకు తగ్గుతాయి. సింగూర్ జలాశయం నుంచి భాగ్యనగరానికి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించడంపై మంత్రి తలసాని హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. సింగూర్ నుంచి రోజుకు 90మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేయించడం అభినందనీయమన్నారు.

'ఈనాడు' కథనాలకు స్పందన

కొమ్మలు తొలగించారు.. అవ్వను తరలించారు

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: 'ఈనాడు'లో ప్రచురితమైన రెండు కథనాలకు జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ యంత్రాంగం స్పందించింది. ఈనెల 30న 'చినుకొస్తే వంతెనల్లో వణుకు' శీర్షికతో వచ్చిన కథనానికి యంత్రాంగం అప్రమత్తమై లాలాపేట వంతెనపై పెరుగుతున్న చెట్టు కొమ్మలను తొలగించి వేశారు.

- బోయిగూడ రైల్వే వంతెన వద్ద ఓ అవ్వ చాలా రోజులుగా అక్కడే మురుగును తట్టుకుంటూ గడుపుతోందంటూ ఆగస్టు 30న కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించి.. ఆమెను నామాలగుండులోని రాత్రి శిబిరానికి తరలించారు. వంతెన వద్ద మురుగును తొలగించారు.



చెట్టు తొలగించిన తర్వాత..



అవ్వతో మాట్లాడుతున్న సిబ్బంది

ఇక చకచకా ఇళ్ల నిర్మాణాలు

- లక్ష రెండు పడక గదుల ఇళ్లకు టెండర్లు పూర్తి

హైదరాబాద్. న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేరనుంది. బుధవారం రెండోదశ టెండర్‌లో 31704 ఇళ్ల నిర్మాణానికి ప్రక్రియ పూర్తయింది. తద్వారా లక్ష రెండు పడక గదుల ఇళ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లయింది. మొత్తం ఇళ్ల నిర్మాణాలకు రూ.8.225 కోట్లు కానున్నట్లు బల్దియా పేర్కొంది. 33 బస్తీల్లో నివాసముంటున్న వారిని ఖాళీ చేయించి ఇళ్ల కోసం కేటాయించింది. అయితే అధిక స్థలం ఉన్నవారు నిరాకరించి కోర్టును ఆశ్రయించడంతో ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో కొన్ని స్వచ్ఛంద సంస్థలు స్థల యజమానులను ఒప్పించడంతో మార్గం సులభమైందని బల్దియా వెల్లడించింది. ఇప్పటివరకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కేవలం ఐడీహెచ్ కాలనీలో మాత్రమే నిర్మించారు. ప్రస్తుతం అనుకూలంగా ఉన్న 33 బస్తీల వారు కూడా ఒప్పుకోవడంతో లక్ష్యం దిశగా ముందుకెళ్తామని పేర్కొంది.


కలెక్టర్లతో నిత్య సమావేశాలు.. ఇళ్ల నిర్మాణానికి 109 ప్రాంతాల్లో కావాల్సిన స్థల విషయమై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చేల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిత్యం సమావేశాలు ఏర్పాటు చేసి చర్చిస్తున్నారు. భూములను పర్యవేక్షించే సంయుక్త కలెక్టర్లు, డీఆర్ఓలతో బల్దియా కమిషనర్ జనార్దన్‌రెడ్డి సమీక్షిస్తున్నారు. అయితే గృహప్రవేశాలు దీపావళి నుంచే ఉంటాయని తెలుస్తోంది. ప్రధానంగా నాచారంలో ఉన్న సింగం చెరువు తండాలో నిర్మిస్తున్న 196 ఇళ్లు, అనంతరం మన్సురాబాద్‌లోని ఎరుకల నాంచారమ్మ బస్తీలోని నిర్మాణాలు పూర్తి కానున్నట్లు బల్దియా పేర్కొంది.

రద్దీగా ఫీవరాసుపత్రి

నల్లకుంట: నల్లకుంటలోని ఫీవరాసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. వర్షాలకు ప్రజలు రోగాల బారిన పడుతూ ఆసుపత్రుల బాట పడుతున్నారు. బుధవారం 1329 మంది ఔట్‌పేషెంట్ విభాగంలో వైద్య పరీక్షలు పొందారు. వీరిలో 29 మంది పరిస్థితి క్షీణించడంతో చేర్చుకొని వైద్యం అందజేస్తున్నారు. అలాగే జ్వరం తీవ్రంగా ఉన్నవారికి మలేరియా, స్వైన్‌ఫ్లూ, డెంగీ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

భళా.. బాలే!

రవీంద్రభారతి: శాస్త్రీయ రీతిలో పాశ్చాత్య సంప్రదాయ బాలే నృత్యాన్ని ప్రదర్శించి నగరవాసులకు మధురానుభూతిని పంచారు న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ నర్తకి టైలర్ గోర్డాన్. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సమర్పణలో 'బాలెట్ న్యూయార్క్ సిటీ ఇన్ హైదరాబాద్' శీర్షికన నగరంలోని స్టెప్స్ డాన్స్ స్టూడియో నిర్వాహకులు పృథ్వీరామస్వామి, ఆయన శిష్యులతో కలిసి బుధవారం రాత్రి రవీంద్రభారతిలో గోర్డాన్ ప్రత్యేక ప్రదర్శనిచ్చారు. బాలే నృత్యం వినోద సాధనమే కాక శారీరక దారుఢ్యానికి, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచే చక్కటి వ్యాయామం కూడా అని ఆమె తెలిపారు. సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ జ్యోతి వెలిగించి ప్రదర్శన ప్రారంభించారు.





నటి హర్షిత

'సిల్క్ ఇండియా ఎక్స్‌పో' ప్రారంభం

కార్ఖానా, న్యూస్‌టుడే: కంటోన్మెంట్‌లోని ఇంపీరియల్స్ గార్డెన్‌లో 'హస్తశిల్పి ఆన్ ఆర్టిసన్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో 'సిల్క్ ఇండియా ఎక్స్‌పో' బుధవారం ప్రారంభమైంది. దీనిని వర్ధమాన తారలు హర్షిత, స్వాతి లింగాల, సంఘసేవకురాలు ఆకాంక్ష కలిసి ప్రారంభించారు. ఈ ప్రదర్శన సెప్టెంబర్ 4 వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకుడు అభినంద్ తెలిపారు. 21 రాష్ట్రాల నుంచి 79 స్టాళ్ల ద్వారా చేనేత వస్త్రాల తయారీ దారులు, చేతి పని బృందాలు, సహకార సంస్థలు వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారన్నారు.



ఎన్నెన్నో వర్ణాలు.. మురిసాయి వృక్షాలు

మాదాపూర్‌లోని హైటెక్స్ వద్ద ఈత చెట్ల మొదళ్లకు రంగురంగుల పెయింటింగ్ వేశారు. దీంతో అవి ఇంద్రధనస్సుతో పోటీపడుతున్నాయా అన్నట్లుగా చూపరులను ఆకట్టుకుంటున్నాయి.


8న 'యువ కళావాహిని-గోపీచంద్' పురస్కార ప్రదానం

అబ్దుల్లాపూర్‌మెట్: గోపీచంద్ జయంతిని పురస్కరించుకొని యువ కళావాహిని-గోపీచంద్ నేషనల్ లిటెరరీ అవార్డు-2017ను సెప్టెంబరు 8వ తేదీన ప్రముఖ కన్నడ రచయిత్రి వైదేహికి అందజేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. నగరంలోని పొట్టిశ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లిక్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ కళామందిరంలో 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఏర్పాటు చేస్తున్న కార్యక్రమానికి తమిళనాడు పూర్వ గవర్నర్ కె.రోశయ్య ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఎస్వీ సత్యనారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని.. ఎస్.కొండల్‌రావు, డా.టీహెచ్ చౌదరి, సుద్దాల అశోక్‌తేజ, వీబీ తారకేశ్వర్, శ్రీలత తదితరులు పాల్గొంటారన్నారు. వైదేహికి అవార్డుతో పాటు రూ.25 వేల నగదు బహుమతిని అందిస్తారు.

ఎస్‌హెచ్‌వోలు ఎవరు!

కొత్త ఠాణాలపై కొనసాగుతున్న సందిగ్ధం

జంట కమిషనరేట్లపై తేలని పీటముడి



ఈనాడు, హైదరాబాద్

రాజధాని కేంద్రంగా ఉన్న హైదరాబాద్, ఉమ్మడి సైబరాబాద్ కమిషనరేట్లలోని ఠాణాలకు ఎస్‌హెచ్‌వోలుగా ఇన్‌స్పెక్టర్లుండటం ఆనవాయితీ. ఆయా ఠాణాల్లోని ప్రాంతాల్ని సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టారుకు ఎస్సైని నియమించడం ఇప్పటివరకు కొనసాగుతున్న పద్ధతి. కానీ ఉమ్మడి సైబరాబాద్‌ను విభజించి సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు ఏర్పాటు చేశాక పరిస్థితిలో చాలా వరకు మార్పు వచ్చింది. ఈ రెండు కమిషనరేట్లలో గ్రామీణ ప్రాంతాల నుంచి కొత్తగా చేరిన ఠాణాల్లో ఎస్సైలే ఎస్‌హెచ్‌వోలుగా కొనసాగించాల్సి వచ్చింది. కానీ జంట కమిషనరేట్లు ఆవిర్భవించి ఏడాది దాటినా ఆయా ఠాణాలను అప్‌గ్రేడ్ చేసే విషయంలో నెలకొన్న సందిగ్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆయా ఠాణాలకు ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించేందుకు అనుమతి లభిస్తుందా..? లేక ఇప్పటి మాదిరిగానే ఎస్సైలనే ఠాణాలకు బాధ్యుల్ని చేస్తారా..? అనేది అనిశ్చితిగానే ఉంది.

రాచకొండలో 17.. సైబరాబాద్‌లో 12

విభజన అనంతరం సైబరాబాద్ కమిషనరేట్‌లోకి పాత మహబూబ్‌నగర్‌తోపాటు మెదక్ జిల్లాల నుంచి కొన్ని ఠాణాలను విలీనం చేశారు. అలాగే రాచకొండలోకి కొత్తగా ఏర్పడిన యాదాద్రి జిల్లాను మొత్తంగా చేర్చారు. ఈ నేపథ్యంలో జంట కమిషనరేట్లలో కొత్తగా చేరిన ఠాణాల్లో చాలా వాటికి ఎస్సైలనే ఎస్‌హెచ్‌వోలుగా కొనసాగిస్తున్నారు. సైబరాబాద్ పరిధిలో కొత్తగా చేరిన చేవెళ్ల, షాద్‌నగర్, షాద్‌నగర్ రూరల్, అమనగల్లుతోపాటు రాచకొండలో విలీనమైన భువనగిరి, యాదగిరి గుట్ట, చౌటుప్పల్, రామన్నపేట ఠాణాలకు మాత్రం అప్పటికే సర్కిళ్లు ఉండటంతో ఇన్‌స్పెక్టర్లున్నారు. వీటితోపాటు సైబరాబాద్‌లో మరో 12, రాచకొండలో మరో 17 కొత్త ఠాణాలు కలిశాయి. వీటన్నింటికి ప్రస్తుతం ఎస్సైలే ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నారు. ఈ ఠాణాలనూ అప్‌గ్రేడ్ చేయాలని గతంలోనే రెండు కమిషనరేట్ల ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ సైబరాబాద్ విభజన జరిగి ఏడాది దాటినా ఈ విషయంలో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

అంత అవసరం ఉందా..?

వాస్తవానికి కమిషనరేట్ల పరిధిలో జనసాంద్రత ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో ఠాణాల విస్తీర్ణం పరిధి తక్కువగా ఉన్నా సీఐ స్థాయి అధికారినే ఎస్‌హెచ్‌వోగా నియమిస్తారు. అలాగే సెక్టార్లుగా విభజించి ఎస్సైలకు బాధ్యతలు అప్పగిస్తారు. ఉమ్మడి సైబరాబాద్‌లో కనిష్ఠంగా నలుగురి నుంచి గరిష్ఠంగా తొమ్మిది మంది వరకు ఎస్సైలుండేవారు. కానీ విభజన తర్వాత జంట కమిషనరేట్ల స్వరూపాలే మారిపోయాయి. నెలలో కనీసం పది కేసులైనా నమోదు కాని ఠాణాలూ కమిషనరేట్లలో అంతర్భాగమయ్యాయి. పట్టుమని పదివేల జనాభా కూడా లేని ఠాణాలూ ఈ జాబితాలో వచ్చి చేరాయి. దీంతో ఇలాంటి ఠాణాలకు ఎస్‌హెచ్‌వోలుగా ఇన్‌స్పెక్టర్లు అవసరం ఉంటుందా..? అనే అభిప్రాయాలూ లేకపోలేదు. ఆ ఠాణాలకు ఇన్‌స్పెక్టర్లను నియమించడం.. సెక్టార్లను ఏర్పాటు చేసి ఎస్సైలను కేటాయించడం అనవసరపు ప్రహసనమే అవుతుందని పోలీస్‌వర్గాలే భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందనే విషయంపై సందిగ్ధం కొనసాగుతూనే ఉంది.



నిందితుని వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వేంకటేశ్వర్‌రావు

డ్రగ్స్ కేసులో రెస్టారెంటు నిర్వాహకుడి అరెస్టు

నాగోలు, న్యూస్‌టుడే: డ్రగ్స్ కేసులో ఓ రెస్టారెంటు నిర్వాహకుడిని రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వేంకటేశ్వర్‌రావు నిందితుని వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం కడపజిల్లా మైదుకూరుకు చెందిన కొప్పర్తి అన్నారపు పవన్‌కుమార్ రెడ్డి(34) బీటెక్ పూర్తిచేశాడు. నగరంలోని కొండాపూర్ కొత్తగూడ సమీపంలోని శ్రీరాంనగర్‌లో ఉంటున్నాడు. గతంలో హైదరాబాద్, దిల్లీ ఐటీసంస్థల్లో ఉద్యోగం చేసి 2014లో మానేసి సొంతవ్యాపారం పెట్టుకున్నాడు. తాజాగా షేక్‌పేటలో వర్ణిత ఫ్యామిలీ మల్టీవెర్షన్ రెస్టారెంటు నడుపుతున్నాడు. జూబ్లీహిల్స్‌లోని ఓవర్ ది మూన్ పబ్ (ఓటీఎం)కు తరచూ వెళ్తుంటాడు. గతేడాది నవంబరులో స్నేహితులతో కలిసి గోవా వెళ్లిన పవన్‌కుమార్‌రెడ్డికి అక్కడ యాన్ అనే నైజీరియన్ పరిచయమయ్యాడు. యాన్ ద్వారా కొకైన్‌కు బానిసైన పవన్‌కుమార్‌రెడ్డి.. దానిని ఒక్కో గ్రాముకు రూ.5వేలకు కొనుగోలు చేసి తాను సేవించడమే కాకుండా స్నేహితులకు సైతం అమ్మడం ప్రారంభించాడు. తరచూ గోవా వెళ్లి కొనుగోలు చేసే అతనికి నగరంలోనే ఉండే కాస్మోస్ అనే నైజీరియన్‌ను పరిచయం చేశాడు యాన్. దీంతో వీరిద్దరి వద్ద కొకైన్ కొని ఎక్కువ ధరకు అమ్మి సొమ్ముచేసుకుంటున్నాడు. దీంతోపాటు నగరంలోని పబ్‌లలో ఈవెంట్లు నిర్వహించే మేనేజర్‌గానూ వ్యవహరిస్తున్నాడు. ఈవెంట్ల కోసం ముంబయి, బెంగళూరు, కోల్‌కత్తా, దిల్లీలకు చెందిన మహిళా మోడళ్లను రప్పించేవాడు. ఈవెంట్లకు వచ్చే కస్టమర్లకు డ్రగ్స్ సరఫరా చేయడంతోపాటు మోడళ్లుగా వచ్చిన యువతులను అక్రమ కార్యకలాపాలకు వినియోగిస్తూ సొమ్ముచేసుకుంటున్నాడన్న సమాచారం పోలీసులకు ఉంది. ఇటీవల రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ పోలీసులు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురు నైజీరియన్లతోపాటు మరో నలుగురు స్థానికులను అరెస్టుచేశారు. ఇదే కేసులో నిందితుడైన పవన్‌కుమార్‌రెడ్డిని తాజాగా అరెస్టుచేశారు. సదరు నిందితుడిని కస్టడీలోకి తీసుకుని తదుపరి విచారణ చేపడతామని డీసీపీ తెలిపారు.





ఉస్మానియా ఆసపత్రిలో రోగులకు సరిపడా పడకలు లేక కింద, స్ట్రెచర్‌పై పడుకోబెట్టాల్సిన పరిస్థితి దాపురించింది. సెలైన్ బాటిల్ తగిలించడానికి స్టాండులు లేక స్విచ్ బోర్డుకు తగిలిస్తున్నారు. వైద్యం కోసమంటూ అత్యవసర పరిస్థితుల్లో ఇక్కడికి వస్తే.. కనీస వసతులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓయూ పీజీ విద్యార్థినికి వేధింపులు

ఈనాడు, హైదరాబాద్: ముందు స్నేహం చేసి.. తర్వాత నిర్లక్ష్యం చేసిందనే అక్కసుతో ఓయూ పీజీ విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన తోటి విద్యార్థిని నగర సీసీఎస్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీసీఎస్ డీసీపీ అవినాశ్ మహంతి తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన విద్యార్థిని(21) ఓయూలో ఎమ్మెస్సీ జియోఫిజిక్స్ రెండో సంవత్సరం చదువుతోంది. వరంగల్ జిల్లా తొర్రూరు మండలం ఫతేపురానికి చెందిన ఎర్నం నరేశ్(25) ఓయూ హాస్టల్‌లో ఉంటూ ఆమెతోపాటే చదువుతున్నాడు. 2016 నుంచి పరిచయం పెంచుకున్న నరేశ్ ఉపకార వేతనానికి దరఖాస్తు చేసే నెపంతో బాధితురాలి మెయిల్‌ఐడీ, పాస్‌వర్డ్ తీసుకున్నాడు. అనంతరం కొంతకాలానికి అతడి వైఖరి నచ్చకపోవడంతో విద్యార్థిని గత జూన్ నుంచి అతడిని దూరం పెడుతూ వచ్చింది. చరవాణి నంబరునూ మార్చేసింది. దీంతో అక్కసు పెంచుకున్న నరేశ్ ఫేస్‌బుక్‌లో వేధింపులకు ఉపక్రమించాడు. ఆమె స్నేహితురాళ్లకు బాధితురాలి గురించి అసభ్యకర సందేశాలు పంపించడం ఆరంభించాడు. పద్ధతి మార్చుకోవాలని బాధితురాలు హెచ్చరించింది. నరేశ్ వైఖరి మారకపోవడంతో షీ బృందానికి ఫిర్యాదు చేసింది. నిందితుడు మరింత రెచ్చిపోయి.. నేరుగా బాధితురాలి సోదరుడి చరవాణికే అసభ్య సందేశాలు పంపిస్తున్నాడు. బాధితురాలు మంగళవారం సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం నరేశ్‌ను రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: విద్యుద్ఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఫలక్‌నుమా ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలాపత్తర్‌కు చెందిన మహ్మద్ అక్రమ్ కుమారుడు, ఎలక్ట్రీషియన్ మహ్మద్ ఇమ్రాన్(20) మంగళవారం రాత్రి జంగమ్మెట్ ఖాద్రీచమన్ మార్గంలో రిసాలా ప్లేగ్రౌండ్ ఎదురుగా ఉన్న గల్లీలోని ఓ ఇంట్లో ఫంక్షన్ ఉండగా రెండు ఫోకస్ లైట్లు ఏర్పాటు చేశాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి డాబా పైకి ఎక్కి ఫోకస్ లైట్లకు ఉన్న విద్యుత్ కనెక్షన్ తొలగిస్తుండగా విద్యుద్ఘాతానికి గురయ్యాడు. వెంటనే అతనిని శాలిబండలోని ఆస్రా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్ఐ సాయికిరణ్, గోకారిలు సంఘటనా స్థలాన్ని సందర్శించి, ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. నేరుగా విద్యుత్ తీగెల నుంచి అక్రమ విద్యుత్ కనెక్షన్ తీసుకోవడం, ఎర్తింగ్ లేకపోవడం, డాబాపై వర్షపునీళ్లు నిలిచి ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఫలక్‌నుమా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఫార్మసీ సూపర్‌వైజర్ల సమస్యలను పరిష్కరించాలి'

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఫార్మసీ సూపర్‌వైజర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ వైద్య ఆరోగ్య గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎంహెచ్‌జీఓఏ) అధ్యక్షులు జూపల్లి రాజేందర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఫార్మసీ సూపర్‌వైజర్ల సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం కోఠి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్ ఆవరణలోని టీఎంహెచ్‌జీఓఏ కార్యాలయంలో జరిగింది. టీఎంహెచ్‌జీఓఏ అధ్యక్షులు జూపల్లి రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఖలీముద్దీన్, కోశాధికారి వెంకటయ్య పాల్గొన్నారు. ఫార్మసీ సూపర్‌వైజర్ల సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలు చేశారు. అనంతరం తెలంగాణ ఫార్మసీ సూపర్‌వైజర్ల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఎన్.సోమమల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.పాండు ఎన్నికయ్యారు.

అబిడ్స్‌లో ఉద్యోగ మేళా రేపు

అబిడ్స్: అబిడ్స్‌లోని మున్సిపల్ పార్కింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ (అబిడ్స్) కార్యాలయంలో మార్గదర్శి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, జీహెచ్‌ఎంసీల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ ఉప కమిషనరు సేవా ఇస్లావత్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ కార్యాలయం నెలకొని ఉన్న అబిడ్స్ మున్సిపల్ పార్కింగ్ కాంప్లెక్స్‌లోని మూడో అంతస్థులో పౌర సేవా కేంద్ర వద్ద శుక్రవారం ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉద్యోగ మేళా జరుగుతుందని తెలిపారు. మార్గదర్శి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో అసిస్టెంట్ సేల్స్‌మెన్ ఉద్యోగాల కోసం ఈ మేళాలో దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేయడం జరుగుతుందని వివరించారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై 19 నుంచి 26 ఏళ్ల వయస్సు కల్గిన అభ్యర్థులు ఉద్యోగ మేళాలో ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,645/- వేతనంతో పాటు డీఏ సౌకర్యం కల్పిస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుంతలే... జేబులు నింపుతున్నాయ్!

(మొదటి పేజీ తరువాయి) వెల్లువెత్తుతున్నాయి. రోడ్లను బాగు చేసేందుకు ఏటా కోట్లాది రూపాయల వ్యయమవుతున్నా... జనానికి మాత్రం గుంతల్లో ప్రయాణం తప్పటంలేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఏ రోజుకు ఆరోజు గుంతల్ని పూడ్చేయాలని కమిషనర్ గతేడాది నుంచి ఇంజినీరింగ్ విభాగానికి చెబుతూ వస్తున్నారు. దాంతో సర్కిల్ ఇంజినీర్లు.. ఎలాగైనా సరే గుంతల్ని పూడ్చేయండని గుత్తేదారులకు ఆ బాధ్యత అప్పగించారు. అదే అదనుగా వారు తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఫలితంగా వేసిన ఒక్క రోజులోనే ఆ ప్రాంతం మునుపటికన్నా ప్రమాదకరంగా మారుతూ.. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

నేను ఏ తప్పూ చేయలేదు.. నిందితుడిని చేయడం తగదు

మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు ఎం.విక్రమ్‌గౌడ్

అబిడ్స్: నేను ఏ తప్పు చెయ్యలేదు. నాపైనే హత్యాయత్నం జరిగింది. నాపైనే కేసులు పెట్టారు. న్యాయ స్థానంలో తనకు న్యాయం జరుగుతుందన్న పూర్తి నమ్మకం, విశ్వాసం ఉందని మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు ఎం.విక్రమ్‌గౌడ్ అన్నారు. జ్యూబ్లీహిల్స్ కాల్పుల ఘటన అనంతరం జుడీషియల్ రిమాండ్‌పై విడుదల అనంతరం తొలిసారిగా గోషామహల్ సెగ్మెంట్‌లో బుధవారం ఆయన పర్యటించారు. ముందుగా నియోజకవర్గంలోని పలు వినాయక మండపాల వద్ద అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం జాంబాగ్ డివిజన్‌లోని చారిత్రక నాంపల్లి యూసుఫ్ బాబా దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు విక్రమ్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు నవీద్ అహ్మద్, పురుషోత్తం, జితేందర్‌సింగ్ జిత్తూ, ఇక్బాల్, ఖదీర్, సత్తూసింగ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఐపీఎస్ డీవీఎల్ఎన్ రామకృష్ణారావు మృతి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: విశ్రాంత ఐపీఎస్ అధికారి డీవీఎల్ఎన్ రామకృష్ణారావు (84) మృతి చెందారు. గత కొంత కాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండడంతో ఇటీవలే సికింద్రాబాద్ అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. 1957 బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రింటింగ్ ప్రెస్ డైరెక్టర్, నగర పోలీస్ విభాగంలో అదనపు కమిషనర్, ఇండో టిబెటన్ బోర్డర్ డీజీపీగా సేవలందించారు.

వైద్య వృత్తిలో రాణించడం అందరికీ సాధ్యపడదు. భయం, భావోద్వేగం, ఇతరత్రా అడ్డంకులను అధిగమిస్తేనే నైపుణ్యం సిద్ధిస్తుంది. గంటల వయసున్న శిశువుకూ సూది మందు ఇవ్వాలి. స్పందించే హృదయాన్ని చేతులతో సరిచేయాలి. రక్తమాంసాలను యంత్ర సామగ్రిలా భావించాల్సి ఉంటుంది. రోగి ఎవరైనా సరే.. వాళ్లని చూసే దృష్టికోణం మాత్రం ఒకేలా ఉండాలనేది వైద్యశాస్త్రంలోని ప్రధాన సూత్రం. ఇవన్నీ విద్యార్థులు తరగతిలో చదువుకునేవే. అయినా కొత్త విషయాలు నేర్చుకోవడం.. పాతవాటిని మరిచిపోవడం జరుగుతూంటుంది. ఈ అంతరాన్ని భర్తీ చేసేందుకు గాంధీ వైద్య కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు బుధవారం వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించి తర్వాతి తరగతులకు మార్గదర్శనం చేశారు.



గతి తెలిపే మననం

గాంధీ వైద్య కళాశాలలో 'ఏజిస్-2017' ప్రారంభం

వినూత్న పద్ధతుల్లో వైద్య పక్రియల ప్రదర్శన ● విషయం బోధపడేందుకు ఇదో మార్గమన్న విద్యార్థులు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, గాంధీ ఆసుపత్రి

మనిషి అవయవాలు, వాటికొచ్చే జబ్బులు, చికిత్సా విధానాలు వైద్యవిద్యలో భాగం. నేర్చుకున్న విధానాలను మరోసారి మననం చేసుకుంటేనే లోపాలు తెలుస్తాయి. వాటిని ఎలా అధిగమించాలో తెలిపేందుకు, అపోహలు, భయాలను పోగొట్టేందుకు గాంధీ వైద్య కళాశాలలో 'ఏజిస్-2017' పేరిట ఇంటర్ మెడికల్ సింపోజియం ప్రారంభమైంది. ఈ ప్రదర్శన మూడు రోజులు కొనసాగనుంది. వైద్యవిద్యకు సంబంధించి తాము నేర్చుకున్న అన్ని చికిత్సా విధానాలను 54 స్టాళ్లలో ప్రదర్శించామని విద్యార్థులు తెలిపారు. 'ఇంటర్మీడియట్ చదువులో ఎక్కువ మంది బట్టీ విధానాన్ని పాటిస్తారు. పాఠ్యాంశాలపై పట్టులేకపోయినా అక్కడ మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. వైద్యవిద్యలో మార్కులు కొంత వరకే పనిచేస్తాయి. ఇక్కడ పెన్ను పట్టడం ఎంత ముఖ్యమో... నాడి పట్టి వైద్యం చేయడమూ అంతకన్నా ముఖ్యమైనది. చాలామంది ప్రాక్టికల్స్ అంటే భయపడతారు. శస్త్రచికిత్సల సమయంలో ఆందోళన చెందుతారు. రోగులను, మృతదేహాలు, ప్రసవాలను, అప్పుడే పుట్టిన శిశువును చూసి భయానికి గురవుతారు. సూది మందు ఇవ్వడం, రక్తాన్ని సేకరించడం, ఎక్కించడం చేయాలంటే చేతులు వణుకుతుంటాయి. వాటన్నింటినీ పోగొట్టేందుకు 'ఏజిస్' ఉపయోగపడుతుంది' అని నిర్వాహకులు 'ఈనాడు'తో తెలిపారు. డాక్టర్ కాకర్ల సుబ్బారావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగిని పరీక్షించే విషయంలో చేయి పట్టుకుని పరీక్షించి వైద్యం చేయడం ఉత్తమ పద్ధతన్నారు. విద్యార్థి దశలోనే అంకిత భావం, సమయస్ఫూర్తిని పెంపొందించుకుని రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఈ రమేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ మంజుల, సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అవయవదానం చేయాలనుకునే ఔత్సాహికుల కోసం జీవన్‌దాన్ ట్రస్టు ప్రదర్శనలో కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.



సింపోజియాన్ని ప్రారంభిస్తున్న కాకర్ల సుబ్బారావు

నిమిషంలో మూడు ఎక్స్‌రేలు... రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రదర్శన ఆకట్టుకుంది. వేర్వేరు వ్యాధులు, రుగ్మతలకు సంబంధించిన ఎక్స్‌రేలను సీనియర్ విద్యార్థులు ప్రదర్శనలో ఉంచారు. జూనియర్లు నిమిషంలో మూడు ఎక్స్‌రేలను పరిశీలించి వాటిలోని లోపాలను గుర్తించాలి. వేగంగా, కచ్చితత్వంతో పనిచేసే నైపుణ్యం వైద్యులకు అవసరమని చెప్పేందుకే పోటీ అని ప్రదర్శనకారులు తెలిపారు.



ఆరోగ్య వైకుంఠపాళి ఆడుతున్న విద్యార్థినులు

అప్పుడే పుట్టిన శిశువు సూది..

అప్పుడే పుట్టిన శిశువుకు ఏదైనా అనారోగ్యం ఉన్నట్లు తేలితే. . సున్నితమైన శరీరానికి జాగ్రత్తగా వైద్యం చేయాలి. ఇది క్లిష్ట తరమైన విద్య. ఏకాగ్రతతో అప్పుడే పుట్టిన శిశువుకు ఎలా వైద్యం చేయాలి, సూది ఎలా ఇవ్వాలి, ఇతరత్రా పరీక్షలు చేసే విధానాలను సీనియర్ విద్యార్థులు శిశువు బొమ్మలతో ప్రయోగాత్మకంగా చూపారు.

వ్యర్థాల నిర్వహణే కీలకం..

ఆస్పత్రుల్లో వ్యర్థాల నిర్వహణ సవాలుతో కూడుకున్నది. జీవ వ్యర్థాల నుంచి సూదులు, దూది, శస్త్రచికిత్స వల్ల వెల్లడయ్యే వ్యర్థాలు, గాయాల కట్లు మార్చినప్పుడు ఉత్పత్తయ్యే వ్యర్థాల వరకు ప్రతిదీ పర్యావరణానికి ప్రమాదకరం. బాక్టీరియా, వైరస్, రసాయనాలు, తదితరాలు మున్సిపల్ వ్యర్థాల్లో కలిస్తే అంటు వ్యాధులు ప్రబలుతాయి. కాలుష్యం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రుల వ్యర్థాలను ఎలా బూడిద చేయాలో తెలుపుతూ సీనియర్లు సవివర ప్రదర్శన ఏర్పాటు చేశారు.

అరుదైన అవకాశం...



– అక్షర, చివరి సంవత్సరం విద్యార్థి

ఐదేళ్లుగా మేం చదివినవి, నేర్చుకున్న అంశాలను అవసరమైనపుడు స్పష్టంగా జ్ఞప్తికి తెచ్చుకోలేం. నేర్చుకున్న అంశాలను క్రమం తప్పకుండా అభ్యసన, మననం చేసుకుంటేనే చదువుకు అర్థం ఉంటుంది. ఈ ప్రదర్శన ఉద్దేశం అదే. అన్ని విభాగాలూ ఇందులో పాల్గొంటాయి.

జూనియర్లకు దిక్సూచిలా...



– రిషిక, వైద్య విద్యార్థి

నేర్చుకున్న విద్యను ఎలా ఆచరణలో పెట్టాలనే అంశాలపై మాకు మా సీనియర్లు, మేం మా జూనియర్లకు మార్గదర్శం చేస్తున్నాం. పుస్తకాల్లో చదివినవి, శిక్షణలో తెలుసుకున్నవి, ప్రత్యేకంగా పరీక్షించిన అంశాలను అందరూ విభాగాలవారీగా ప్రదర్శనలో పెట్టాం. దీనివల్ల అందరికీ, అన్ని అంశాలను నేర్పించవచ్చు.

వచ్చేశాం... అ'ధర'గొట్టేస్తాం...

పాతబస్తీలో బక్రీదు సందడి జోరందుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి పొట్టేళ్లను, మేకపోతుల్ని తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. బార్కాస్ ప్రాంతంలో అమ్మకానికి పెట్టిన ఈ పొట్టేలు, మేకపోతుల ఖరీదు రూ.10 వేల నుంచి లక్ష వరకూ ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.





కొనసాగుతున్న సహాయక కార్యక్రమాలు

ఆందోళనలో అపార్ట్‌మెంటు వాసులు

మియాపూర్, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మదీనగూడలో సెల్లార్ రిటైనింగ్‌వాల్ కూలి పక్కనేఉన్న అపార్ట్‌మెంట్‌కు ప్రమాదం ఏర్పడిన ప్రాంతంలో సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పర్యవేక్షణలో జీహెచ్‌ఎంసీ, పోలీస్ సిబ్బంది ప్రమాదం జరగకుండా నాలుగు రోజులుగా చర్యలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే సత్యనారాయణ ఎన్‌క్లేవ్‌వైపు సెల్లార్‌కు అపార్ట్‌మెంటుకు మధ్య రిటైనింగ్ వాల్ కూలిపోయిన ప్రాంతంలో ఇసుక బస్తాలు ఏర్పాటుచేసి కాంక్రీట్‌తో నీళ్లు అపార్ట్‌మెంట్ వైపు రాకుండా చర్యలు చేపట్టారు. సుమారు 50అడుగుల నుంచి గోడ నిర్మాణ పనులను చేపడుతున్నారు.



మదీనగూడ సత్యనారాణ ఎన్‌క్లేవ్

సత్యనారాయణ ఎన్‌క్లేవ్‌కు మంగళవారంనుంచి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించినట్లు ఏఈ రాజ్ కుమార్ తెలిపారు. గోడకూలి ప్రమాదకరంగా ఉన్నవైపు రాకపోకలు కొనసాగించకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఎస్సైతో పాటు నలుగురు పోలీసులతో పికెటింగ్ ఏర్పాటుచేసినట్లు సీఐ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నా అపార్ట్‌మెంట్ వాసుల్లో మాత్రం ఏం జరుగుతుందోనన్న ఆందోళన కనిపిస్తోంది. తాత్కాలిక మరమ్మతులు కాకుండా పూర్తిస్థాయిలో చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాజేంద్రనగర్

శంషాబాద్ మార్కెట్‌లో కూరగాయల ధరలు

శంషాబాద్: (బుధవారం నాటి ధరలు) కిలో రూ.టమోట 50, ఆలుగడ్డ 25, బెండకాయ 45, దొండకాయ 25, దోసకాయ 30, కాకరకాయ 45, చిక్కుడు 50, వంకాయ తెల్లవి 40, వంకాయ నల్లవి 30, గోకరకాయ 35, బీరకాయ 40, ముల్లంగి 35, క్యాప్సీకం 35, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 35, కీరా 30, చామగడ్డ 35, కందగడ్డ 30, పచ్చిమిర్చి 50, ఉల్లిగడ్డలు 35, బఠాని 25.



పల్లెచెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది

ఇలా ఏర్పాట్లు..

అత్యధిక సంఖ్యలో గణనాథుల నిమజ్జనాలు జరిగే పల్లె చెరువు వద్ద నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాటు చేసిన క్రేన్ నిమజ్జనాలకు ఉపయోగిస్తున్నారు. చివరి రోజుకు మరో రెండు క్రేన్లు ఏర్పాటు చేయనున్నారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. విద్యుత్తు శాఖ అధికారులు ప్రత్యేక వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇన్ని శాఖల అధికారులు ఏర్పాట్లలో పాలుపంచుకుంటున్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పక్కాగా చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశించడంతో రోడ్డులో గుంతలు పూడ్చే కార్యక్రమం కొనసాగుతోంది. ప్రధాన నిమజ్జన ఉత్సవాల నాటిని అన్ని పనులు పక్కాగా చేస్తేనే సాఫీగా నిమజ్జనాలు పూర్తవుతాయని ఉత్సవ కమిటీల ప్రతినిధులు పేర్కొంటున్నారు.



తూతూ మంత్రంగా రోడ్డు పనులు

నిమజ్జన ఏర్పాట్లలో నిర్లక్ష్యం..!

కూలిన టెంట్.. తప్పిన ప్రమాదం

కాటేదాన్, న్యూస్‌టుడే: గణేశ్ నిమజ్జన ఏర్పాట్లలో రాజేంద్రనగర్ సర్కిల్ అధికారుల నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోని హరిజనబస్తీ పల్లె చెరువు కట్టపై నిమజ్జన ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా బందోబస్తు చర్యల్లో పాల్గొంటున్న శాంతిభద్రతల, ట్రాఫిక్ తదితర పోలీసుల కోసం ఏర్పాటు చేసిన భారీ టెంటు ఈదురు గాలులకు ఒక్కసారిగా కుప్పకూలింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదం నుంచి అందరూ సురక్షితంగా బయట పడ్డారు. ఇదిలా ఉంటే సర్కిల్ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో వినాయక నిమజ్జనాలు జరిగేది పల్లె చెరువులోనే. సుమారు 3 వేలకుపైగా విగ్రహాలను ఈ చెరువులో నిమజ్జనం చేస్తారు. ఏటా రూ.40లక్షలకుపైగా నిధులు కేటాయించి అభివృద్ధి పేరుతో అధికారులు చర్యలు చేపట్టే వారు. ఈ నిధులు అధికశాతం పక్కదారి పట్టేవన్న ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది కేవలం రూ.4లక్షల నిధులు మాత్రమే కేటాయించారు. గుర్రపుడెక్క తొలగింపు... రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు వెచ్చిస్తున్నారు. అయినా తూతూ మంత్రంగానే రోడ్డు మరమ్మతులు, గుర్రపుడెక్క తొలగింపు పనులు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నారు.



కుప్పకూలిన భారీ టెంట్

పూర్తిస్థాయి చర్యలు

పల్లె చెరువులోనే భారీ గణనాథులు నిమజ్జనాలు జరుగుతాయని రాజేంద్రనగర్ సర్కిల్ డీఈ శివశంకర్‌గౌడ్ పేర్కొన్నారు. అక్కడ అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పత్తికుంట చెరువు వద్ద సైతం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధికారులంతా ఉత్సవాలు ముగిసే వరకు అందుబాటులో ఉంటారన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

కాటేదాన్: విఘ్నపతికే ఇన్ని అవస్థలా అంటూ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అధికారుల తీరుపై మండిపడ్డారు. నిమజ్జనోత్సవాలకు పల్లెచెరువు ప్రాంతంలో పూర్తి స్థాయి అభివృద్ధి పనులు ఎందుకు చేపట్టలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తూతూ మంత్రంగా గుంతల పూడ్చివేత, ఇప్పటికీ గుర్రపు డెక్క తొలగించకపోవడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. పత్తికుంటలో అదే తీరు, పల్లె చెరువు వద్దా అంతేనా అంటూ ప్రశ్నించారు. నిమజ్జనోత్సవాల నాటికి చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మైలార్‌దేవుపల్లి ఎస్సై నాగాచారి, రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ విజయలక్ష్మి, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సర్కిల్ ఈఈ లచ్చిరామ్, డీఈ శివశంకర్‌గౌడ్, తెరాస నేతలు కాశిగారి యాదగిరి, వెంకటేష్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పల్లె చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

సామూహిక సెలవులకు టాసా మద్దతు



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న శాస్త్రవేత్తలు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధనా, బోధనేతర ఉద్యోగులు సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా సెప్టెంబరు 1వ తేదీన సామూహిక సెలవుల కార్యక్రమానికి తెలంగాణ అగ్రికల్చర్ సైంటిస్టుల అసోసియేషన్ (టాసా) మద్దతు తెలిపింది. టాసా అధ్యక్షులు డాక్టర్ విద్యాసాగర్, గౌరవ ఛైర్మన్ డాక్టర్ గోవర్ధన్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శంకర్, ఇతర కార్యనిర్వాహక సభ్యులు బుధవారం తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పాత పింఛనను విధానాన్ని కొనసాగించాలని కోరుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంజయ్య, డాక్టర్ రజినీకాంత్, ఎస్‌పీ రవికుమార్, సతీష్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి



పాలిథిన్ సంచులు పంపిణీ చేస్తున్న నేతలు

మణికొండ, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని తెరాస మండల మైనార్టీ అధ్యక్షుడు బషీర్ కోరారు. బుధవారం పుప్పాలగూడ గ్రామ పరిధిలోని మసీదుల వద్ద తెరాస నాయకులు ఎం.రాజ్‌కుమార్‌తో కలిసి పాలిథిన్ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగల వేళ గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకంగా వ్యర్థాలను వేసేందుకు ప్రభుత్వం ప్లాస్టిక్ సంచులను అందజేస్తోందన్నారు. నివాసాల్లోని మాంసం వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా సంచుల్లో వేసి పారిశుద్ధ్య సిబ్బంది అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సంతోష్, మల్లేష్, రాజేష్‌సింగ్, నవీన్ తదితరులు ఉన్నారు.

మల్లయోధుడు ప్రకాశ్‌సింగ్‌కు సన్మానం



ప్రకాశ్‌సింగ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ మల్లేష్

మణికొండ, న్యూస్‌టుడే: ప్రాచీన సాంప్రదాయ క్రీడలను ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందని ఎంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో టైటిల్ కైవసం చేసుకున్న వట్టినాగులపల్లి ఉపసర్పంచి భగవాన్‌సింగ్ కుమారుడు ప్రకాశ్‌సింగ్‌ను బుధవారం ఆయన సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. సంప్రదాయ క్రీడలు మరుగుపడుతున్న వేళ యువత ఆసక్తి కనబర్చడం అభినందనీయమన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. సర్పంచి నర్సింహ, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, నాయకులు నాగేష్‌యాదవ్, ధర్మపురి, శంకరయ్య, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



అస్లాంపాషాను సన్మానిస్తున్న కళాశాల ఛైర్మన్ గౌరిసతీష్

నార్సింగి, న్యూస్‌టుడే: పాతబస్తీ యాఖుత్‌పురాలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో బండ్లగూడ విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థి మహ్మద్ అస్లాంపాషా 19 ఏళ్ల లోపు విభాగంలో బంగారు తపకం సాధించారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ గౌరిసతీష్ అస్లం పాషాను సన్మానించి అభినందించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తకుండీ తొలగించాలని వినతి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: సులేమాన్‌నగర్ డివిజన్‌లోని షరీఫ్‌గార్డెన్ సమీప దర్గా ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెత్త కుండీని తొలగించాలని స్థానికులు అబ్దుల్‌సత్తార్ సర్కిల్ అధికారులను కోరారు. దర్గాకు సమీపంలో చెత్త పెద్ద ఎత్తున పేరుకు పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో బక్రీద్ పండుగ ఉన్న నేపథ్యంతో మాంసం వ్యర్థాలు అక్కడ వేసే అవకాశం ఉందని, వెంటనే అధికారులు చెత్తకుండిని అక్కడి నుంచి తొలగించి మరో చోట ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రమాదకర రహదారి..!

శంషాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల రహదారులు ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. భారీ వర్షాలకు గుంతల మయంగా మారిన రహదారుల్లో రాకపోకలకు వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారి మరమ్మతులకు నోచుకోవడం లేదని, అయినా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లుదని స్థానికులు వాపోతున్నారు. రహదారిలో కంకర తేలి, గుంతలు పడి కనీసం నడిచేందుకు వీలులేకుండా మారిందని పలువురు వాపోతున్నారు. శంషాబాద్ గ్రామ ప్రధాన రహదారిలో మామిడిపల్లి తదితర ప్రాంతాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలున్న ప్రాంతంలోని రహదారుల మరమ్మతులను సైతం పట్టించుకోవడం లేదని, దీంతో వేలాది మంది రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం శంషాబాద్‌లో స్థానికులు రహదారి కోసం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు.



శంషాబాద్ గ్రామ ప్రధాన రహదారిపై గుంతలు

స్థానిక ఎమ్మెల్యేకు గ్రామస్థులు పార్టీలకు అతీతంగా సర్పంచి రాచమల్ల సిద్దేశ్వర్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో పది, పదిహేను రోజుల్లో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారని, అయినా ఇంత వరకు ఏలాంటి చర్యలు చేపట్టలదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ ఖ్యాతిగడించిన పట్టణంలో రహదారుల దుస్థితి చూస్తే ఎవరైనా నోరు వెల్లబెట్టాల్సిందేనని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు రహదారుల మరమ్మతులపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్‌ఎం మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు రిమాండ్

శంషాబాద్ గ్రామీణ: ఎయిర్‌పోర్ట్ కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నక్క.గోపాల్ మృతికి కారకుడైనా కారు డ్రైవర్‌ను శంషాబాద్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. పాత బస్తీలోని ఫతే దర్వాజ కు చెందిన సయ్యద్ ముర్తుజాఅలీ(27) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 28న షాద్‌నగర్‌లో విందులో పాల్గొని స్కార్పియో కారులో సాయంత్రం నగరానికి బయలుదేరాడు. ఈ క్రమంలో కారును అజాగ్రత్తగా నడపడంతో మదనపల్లి మలుపు వద్ద కారు అదుపు తప్పి విభాగినిని దాటి అవతలి వైపు రోడ్డు మీదకు దూసుకెళ్లి ఓ మినీ వ్యాన్‌ను, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న గోపాల్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాన్ డ్రైవర్ భద్ర పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముర్తుజాఅలిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు.

రాజేంద్రనగర్

నేడు శంషాబాద్‌కు మంత్రి లక్ష్మారెడ్డి రాక

శంషాబాద్ గ్రామీణ: మండల పరిధిలోని శ్రీరామనగరం జీవా ప్రాంగణంలో శ్రీత్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో జిమ్స్ అయుర్వేదాలయంను నిర్మించారు. గురువారం ఉదయం అయుర్వేదాలయం ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి డా.లక్ష్మారెడ్డి, అయుష్ కమిషనర్ డా.రాజేందర్‌రెడ్డి, మై హోం గ్రూపు అధినేత జె.రామేశ్వర్‌రావు విచ్చేయనున్నారని జీవా ప్రతినిధులు తెలిపారు.

రేపు న్యాయవాదుల విధుల బహిష్కరణ

మియాపూర్, న్యూస్‌టుడే: సెప్టెంబరు ఒకటిన న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ అడహక్ కమిటీ తెలంగాణ రీజన్ ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక బార్ అసోసియేషన్ ఈ నిర్ణయాన్ని తీసుకుందన్నారు.

గణనాథుడి శోభ..

ఆధ్యాత్మిక ప్రభ



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

కాటేదాన్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లి, శాస్త్రిపురం డివిజన్లలో గణనాథుడి నవరాత్రి పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు హరిజన బస్తీ సిద్ధి వినాయక మండపంతో పాటు ఆయా ప్రాంతాల్లోని మండపాలను సందర్శించి గణేశుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్, ఎస్సై నాగచారి, సిద్ధం జగదీశ్వర్, రాజేష్‌యాదవ్, సరికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. గణనాథుడి పూజలతో పాటు స్వచ్ఛభారత్, స్వచ్ఛ హైదరాబాద్ కోసం భక్తులు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కోరారు. డివిజన్‌లోని కాటేదాన్, పల్లెచెరువు, మైలార్‌దేవుపల్లి, దుర్గానగర్, గణేష్‌నగర్, నేతాజీనగర్, బుద్వేల్ రైల్వేస్టేషన్ బస్తీల్లో ఆయన బుధవారం పూజలు నిర్వహించారు.



మణికొండలో పూజల్లో భక్తులు

వెంకటేష్, కాశిగారి యాదగిరి, ఎల్లప్ప, తిమ్మయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మైలార్‌దేవుపల్లి మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్‌గౌడ్ టీఎన్‌జీఓస్ కాలనీలోని మండపంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో తెరాస నేత అమరేష్‌గౌడ్, పెద్దలు శ్రీరాములుపటేల్, చెన్నయ్య పటేల్, గుమ్మడి శ్రీధర్‌రెడ్డి, తిరుమల వెంకటేష్‌గౌడ్, బుచ్చయ్యగుప్తా, శ్రీనివాస్, ప్రేమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికుంటలో నిమజ్జనాలు ప్రారంభం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఏడో రోజు సర్కిల్‌లోని అన్ని మండపాలలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉప్పర్‌పల్లి, కేశవ్‌నగర్ బస్తీల్లో అన్నదానం నిర్వహించారు.

సర్కిల్‌లోని పలు మండపాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పూజలు చేశారు. శివరాంపల్లిలో స్థానికులు అన్నదానం చేశారు. సదాల శ్రీనివాస్‌రెడ్డి, దశరథ్, బాలాజీ, వెంకటేష్, సుందర్, గోవర్ధన్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. హైదర్‌గూడ నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గణేశుడికి కార్పొరేటర్ విజయరాజంగయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుద్వేల్, రాజేంద్రనగర్, భగవతిగూడలో, పద్మశాలిపురం పద్మజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో మండపాల వద్ద పూజల్లో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పూజలు నిర్వహించారు.

శంషాబాద్: పట్టణంలో గణేశ్ ఘనంగా నిర్వహిస్తున్నారు. శంషాబాద్ లోని ఆర్బీనగర్ శ్రీమేధ కళాశాలలోని గణేశ్ మండపంలో కళాశాల ఛైర్మన్ కె.కోటేశ్వర్‌రావు బుధవారం గణపయ్య పూజలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కళాశాల డైరక్టర్ రాజు, భాను, శ్రీశైలం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: మణికొండ శివపురికాలనీలో ఏర్పాటు వినాయక మండపంలో గ్రామ సర్పంచి కె.నరేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ప్రారంభించారు. ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, శ్రీరాములు, శ్రీనివాస్, వెంకటేష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు గతానుభవాల నుంచి ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని, తిరిగి పనుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్సవ సమితిసభ్యులు ఎన్ను నర్సింహారెడ్డి, వై.శ్రీధర్, ఎన్.మల్లారెడ్డి, ఎస్.విజయ్‌కుమార్, రావుల భాస్కర్ తదితరులు మాట్లాడారు. ఉత్సవాలు ప్రారంభమై బుధవారం ఏడవరోజుకు చేరాయని, ఇప్పటి వరకు బారీకేడ్లు ఏర్పాటుపై స్పష్టత లేదన్నారు. పల్లెచెరువు, పత్తికుంటలో ఎలాంటి ఏర్పాట్లు ప్రారంభించలేదని ఆరోపించారు. పత్తికుంటలో కొలను నిర్మాణం ప్రతిపాదించిన దానికి విరుద్ధంగా చేపడుతున్నారన్నారు. పల్లెచెరువులో గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాలని అధికారులను కోరినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. పల్లెచెరువుకు సంబంధించి కోర్టులో కేసు ఉందనే సాకుతో తూతూ మంత్రంగా పనులు చేస్తున్నారని ఆరోపించారు. అధిక సంఖ్యలో విగ్రహాలు పల్లెచెరువులో నిమజ్జనమవుతాయని, అలాంటి చోట అధికారులు నిర్లక్ష్యం చూపడం సరికాదన్నారు. నిమజ్జనోత్సవాలకు రెండు రోజుల సమయం మాత్రమే ఉందని, ఇప్పటికైన అధికారులు పనులు ముమ్మరం చేయాలన్నారు.



నార్సింగి పితాంబరేశ్వర గణేశుడి వద్ద ఎమ్మెల్యే రాజాసింగ్..

గ్రామాలలో ఘనంగా..

నార్సింగి: గండిపేట మండలంలో గణేశ్ నవరాత్రి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నార్సింగిలో పీతాంబరేశ్వర భక్తసమాజం గణపతి మండపాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ బుధవారం సందర్శించి పూజలు చేశారు. నాయకులు రాము, వినోద్, ప్రభు తదితరులు ఆయనను సత్కరించారు. హైదర్షాకోట్‌లో శ్రీవిజయగణపతి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కిస్మత్‌పూర్, బండ్లగూడ, హిమాయత్‌సాగర్, గండిపేట తదితర గ్రామాల్లో ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి.

6న గణేశ్ నిమజ్జనాలు పూర్తి చేయాలి

శంషాబాద్ గ్రామీణ: ఆర్జీఐఏ పరిధిలో ప్రతిష్ఠించిన 181 గణనాథులను సెప్టెంబరు 6న నిమజ్జనాలు పూర్తి చేయాలని ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ఆర్జీఐఏ ఠాణా ఇన్‌స్పెక్టర్ మహేశ్ అధ్యక్షతన అఖిల పక్ష నేతలతో బుధవారం శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కాముని చెరువులో గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లను తహసీల్దార్ జి.సురేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ మహేశ్, నీటి పారుదల శాఖ సహాయ ఇంజినీరు మల్లీఖార్జున్, శంషాబాద్ పంచాయతీ కార్యనిర్వాహక అధికారి శ్యాంసుందర్ తదితరులు పరిశీలించారు. కాముని చెరువులో నిమజ్జనాలకు శివారు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గణనాథులు తరలివచ్చే అవకాశం ఉందని, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ అధికారులకు సూచించారు.



హైదర్షాకోట్ శ్రీవిజయగణపతి ఆలయంలో..



మైలార్‌దేవువుపల్లిలో పూజల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత



ఎంజీఐటీ కళాశాల విద్యార్థులు అందించిన స్కూల్ బ్యాగులతో పాఠశాల విద్యార్థులు

నార్సింగి: గండిపేట మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కంప్యూటర్ సైన్స్ కళాశాల ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులు, కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బుధవారం బైరాగిగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, బూట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థులు చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులతో ఆడిపాడి సందడి చేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు కదిలిన యంత్రాంగం

ఈనాడు కథనానికి స్పందన

శంషాబాద్ గ్రామీణ: శంషాబాద్ మండలం రషీదుగూడలో అన్యాక్రాంతమవుతున్న సర్వే నంబరు 57లోని ప్రభుత్వ భూములను బుధవారం శంషాబాద్ తహసీల్దార్ జి.సురేష్‌కుమార్ సందర్శించారు. ఈ నెల 29న 'కన్నేశారు..కబ్జా చేశారు' శీర్షికతో 'ఈనాడు' ప్రధాన సంచికలో వెలువరించిన కథనానికి రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన గిడ్డంగుల యజమానులు నిర్మించిన రహదారిని జేసీబీతో ధ్వంసం చేసి ప్రభుత్వ భూమిలో బోర్డులను ఏర్పాటు చేశారు. ఆర్టీసీకి కేటాయించిన స్థలంలో శాశ్వత కట్టడాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రెవెన్యూ దస్త్రాల్లో సర్వే సంఖ్య 57లో మొత్తం 26.13 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. దాంట్లో కొంత భూమిని అనధికారికంగా స్థానిక రైతులు కొందరు సాగు చేసుకొంటున్నారు. ప్రభుత్వ భూమి సమగ్ర సర్వే చేసి హద్దులను పటిష్ఠంగా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఏవైనా కట్టడాలను నిర్మిస్తే కఠిన చర్యలు చేపట్టి కూల్చివేస్తామని తహసీల్దార్ సురేష్‌కుమార్ హెచ్చరించారు.

అనుమతులిచ్చిన పంచాయతీ అధికారులు..!

జీఓ 111 నిబంధనల ఉల్లంఘనలపై గతంలో 'ఈనాడు' ప్రధాన సంచికలో 'జీవోచ్ఛవం' అన్న శీర్షికతో వెలువరించిన కథనానికి అప్పట్లో హెచ్ఎండీఏ అధికారులు స్పందించారు. శంషాబాద్, రాళ్లగూడ, రషీదుగూడ, శంకరాపూర్, ఘాన్సిమియాగూడలలో వెలిసిన భారీ అక్రమ కట్టడాలను జేసీబీలతో కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలను మళ్లీ చేపట్టకుండా నిలువరించాల్సిన పంచాయతీ అధికారులు మాత్రం ఒక అడుగు అడుగు ముందుకేసి కూల్చివేసిన కట్టడాలకు అధికారికంగా అనుమతులు ఇవ్వడం స్థానికంగా చర్చానీయాంశమైంది. కూల్చివేసిన కట్టడాల ప్రహరీలపై పంచాయతీ అధికారులు కేటాయించిన ఇంటి నంబరు రాసిపెట్టి మరీ అక్రమ నిర్మాణ పనులను పూర్తి చేస్తుండడం గమనార్హం.



రహదారిని ధ్వంసం చేసి బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

EENADU CLASSIFIEDS

IRON & CEMENT, EYE CARE, COOKING,FLOORINGS, YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, HOUSE KEEPING, COURERS, DRIVING SCHOOLS, TAILORING, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS, ELECTRICAL, FURNITURE FOR SALE, SWEETS

BEAUTY PERSONAL CARE

BEAUTY PARLOUR

"Mirrors Academy" Ofers Career Oriencted Courses with Placement Hairdressing with "LOREAL" make up with "KRYOLAN" NailArt with "NUBAR" of USA & Beauty By MIRRORS. ✆ 9618991818.

HOME NEEDS

PEST CONTROL

Golden Pest Control Termit TRMT- 2B/R 2,000/- 3B/R- 2,500/- 10Yrs Guarantee. Cockroach Bite TRMT. Ph: 9618034224/ 9676211260

REAL ESTATE

FLAT FOR SALE

S.Ft 2,800/- లకే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (VJA), IT పార్కు వద్ద కేసరపల్లిలో RO వాటర్, సోలార్‌వాటర్, వాటర్ సాఫ్ట్‌నర్స్, జిమ్, పార్కింగ్ టైల్స్‌తో 2 & 3 BHK అపార్ట్‌మెంట్లు గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. ✆ 94401 20033, 73372 43565.

JOBS

Elaine Dairy Pvt Ltd Hyd Wanted Sr.Marketing Exe's 3yrs Exp. Qlf: Any Degree. ✆ 9640496258 / 7995021261 Email: gmedpl.pawarrao@gmail.com

క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్, హైదరాబాద్, ఆటోనగర్ బ్రాంచి ఆఫీస్‌నందు గుమాస్తాలుగా పనిచేయుటకు 10 ఆపైన చదివినవారు మరియు ట్రాన్స్‌పోర్ట్‌రంగంలో అనుభవం కల్గినవారు కావలెను. ✆ 83746 99999, 87901 91999.

AGRIBUSINESS

POULTRY

నిన్నటిరేట్లు NECC, హైదరాబాద్ జోన్ 100 కోడిగుడ్ల ధర రూ॥ 355/- చిల్లర ధర రూ॥ 4.15 ఫోన్: 23240329, కల్‌బర్డ్ ధర రూ॥ 62/-per KG, ఫర్‌బర్డ్ ఫోన్: 9000371404.

AUTOMOTIVE

VEHICLES FOR SALE

4 TATA Ace 2 Dost and 3 TATA 407 Company Vehicles Available for Sale for Details Contact: 9334116963

VEHICLES WANTED

We Purchase used Cars @ Your Doorstep, Spot Cash more than market price Free Immd Transfer. 9550892044/ 7673903901

BUSINESS SERVICES

BUSINESS OFFER

Wanted Investment of 20 Lakhs New Business @ Dilsukhnagar Returns will be Paid in 1 Year Cont: 9866195670

Data Entry new projects available with good payout for long term contract. Office setup mandatory with min 5-8 systems ✆ 9515098715.

Call Centre Projects with Min. 10 Seaters Data Entry Projects with Min.. 5 Seater are Available for Out Sourcing ✆ 9652438681

Wanted Investment of Rs. 25-Lakhs for Construction of Site @ Vanasthalipuram Returns in 9 Months Cont: 9160750057

Invest 1 Lac in Our Civil Works @ KPHB Monthly 10% Profit Shurity Agreement + Cheques Given Intrsd Ph: 9989031239.

గ్లైజ్ శిక్షణ: పేపర్ ప్లేట్, కాండిల్, LED తయారు చేసి ఇంటి నుండి రోజు Rs.2,000- 5000 సంపాదించండి. మిషి పర్చేజ్ ఉచితం. తిరిగి కొనుగోలు ✆ 07210009389, 09818729366.

అనంతపురంలో రన్నింగ్‌లో ఉన్న స్కూల్ కొరకు పార్ట్‌నర్స్ కావలెను. ఖచ్చితమైన ఆదాయం సురక్షితం, సంప్రదించండి. Ph: 7799600099.

ప్లాస్టిక్ పరిశ్రమ - మెషిన్లు అమ్మకం. ఇంటివద్దనే కవర్లు తయారీ, ముడిసరుకు ఇచ్చి కొనుగోలు. నెలకు 20 వేలు పైగా ఆదాయం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎంట్రప్రై. ✆ 82978 57530.

పేపర్ ప్లేట్స్, టీ కప్స్ గ్లాస్ మీ ఇంటి వద్దనే తయారు చేస్తూ ఆదనంగా సంపాదించండి మిషన్స్ అమ్మకం ముడిసరుకు ఉచిత ట్రాన్స్‌పోర్ట్ బైబ్యాక్ అగ్రిమెంట్. పల్లవి పేపర్ ప్లేట్స్ Cell: 81795 38429.

EDUCATION

B.Sc. (Agriculture) icar acredited low fee. Limited Seats. Ph.D. (Regular/Part Time) Cell: 79012 42909, 96761 18505.

Earn 1% per day trading course fee - Rs. 2000 per head Sunday 3rd Sept 9 am to 1 pm Bandaru Nageswara Rao 8184875476 Kushaiguda

HOME TUTIONS

Sairam Home Tutions Offer Exp, 1-XII SSC, CBSC, ICSC Inter, EAMCET AIEEE, IIT, B.Tech, Deg, Welcome M/F. Ph: 8328099273/ 9247315777

FINANCIAL SERVICES

CHITS & DEPOSITS

మీ ఆర్థిక అవసరాల పరిష్కారానికై ప్రముఖ సంస్థలో 50 వేలు, 1 లక్ష, 2, 5, 10 లక్షల చిట్టీలు కలవు. కమిట్‌మెంట్ & ఈజీ డాక్యుమెంటేషన్ కలదు. సంప్ర. ✆ 9494611640

HOME NEEDS

PEST CONTROL

Om Swasthik White Ants & Woodbores Tremt. 10 Yrs Guarantee. Cockroach Gel & Spray Tremt. Rs. 499/- ✆ 9542212700, 9542212800.

చెదల నివారణకు వాసనలేని మరకలు పడని కెమికల్స్ తో చెదలు, బొద్దింకలను నివారించి 5 సం॥లు గ్యారంటీ ఇచ్చు సంస్థ AMC చేయబడును. ✆ 9059989604/ 7981533849.

PERSONAL CLASSIFIEDS

LOST

Lost Passport No K7879733 Belonging to Amreen Firdous at Lakdikapul Founder Call: 9392400119

I, Desineni Annapoorna D/o Pasupuleti Kotaiah, R/o. F.No:301, C-Block, Land Mark Towers, Near HDFC Bank, Miyapur. I loss My Passport No: K2561505 While Traveling from Shamshabad to Miyapur. If Anyone found pls ✆ 8125218125

PROFESSIONAL SERVICES

ASTROLOGY

బ్రహ్మశ్రీ 8700 సం॥ నాటి లిపి ఆధారంగా మీ జ్రోటన (వేలు చూసి జాతకము) పరిష్కారాలు చెప్పబడును. సోమశేఖరరెడ్డి, 3-4-376/30, బసంత్‌నగర్, కాచిగూడ "X" రోడ్. ✆ 9848372482

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీవృద్ధాశ్రమం- వృద్ధులకు 4,000/-, బెడ్‌రిడన్‌కు 7,000/-. డాక్టరు సదుపాయం, మంచి భోజనం, సెపరేట్ రూములు & లైఫ్‌టైం సదుపాయం కలదు. ✆ 72078 61660.

REAL ESTATE

FLAT FOR SALE

East Facing, 1510 SqFt, 3 Bed Room, 3 Bath Room, Vidya Nagar (Reliance Fresh) Contact: 8639664172.

Rs.10,99,000 2 BHK, Rs. 15,99,000, 3 BHK Flats at Bandlaguda, 3Km to Nagaram (ECIL) 90% Bank Loan Available 8143640053, 8309164606

గుంటూరు, యనమదల నందు 55 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీలో 17 లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్స్ విల్లాస్ & ఒపెన్ ప్లాట్స్ కలవు. ✆ 9642707777 / 7013416216

HOUSE FOR SALE

Indp & Duplex House HMDA Layout 25 L to 50L, 5 Km From Adibatla IT Companies Nr. ORR Loans B.Bheem Reddy ✆ 8885060742/ 9700974808

Vayupuri (Airforce Society) 732 Sqyds Corner Plot Built up area 2550 Sft (Ground Floor & 1st Floor) Contact (5PM to 9PM) ✆ 9441077444

Boduppal Bus Depo Opp: Mallikarjuna Nagar, Building(s) Portions S/F G+2 75Lakhs. 24Hr Water & Car Parkg. ✆ 9848369716/ 040-27898984.

గండిమైసమ్మ దగ్గర గాగిల్లాపూర్‌లో గేటెడ్ కమ్యూనిటీ నందు ఆనుకొని అన్ని డెవలప్‌మెంట్స్‌తో 150 చ॥గ॥ ప్లాట్స్ & 2BHK Indp 70% బ్యాంక్‌లోన్స్. Ph: 9494100200

HMDA అప్రూవ్ లగ్గరి Indp హౌసెస్, Duplex విల్లాస్ ఉప్పల్ దగ్గరలో గేటెడ్ కమ్యూనిటీ నందు కలవు 167 గ॥ రూ॥ 49.5L. 80% లోన్ 9866324345

LAND FOR SALE

6Acres for Outright, Yadagirigutta, 12kms from Yadadri Temple, Towards Rajapet. Contact: ✆ 7675920584

1 రూ.కే 1/4 ఎకరా రిజి॥ చిట్యాల చౌటుప్పల్, భువనగిరి దగ్గరలో మిగతా EMI తో చెల్లించండి. లాండ్ లీజ్‌పై 2 రెట్లు ఆదాయం. 9666147744

PLOT FOR SALE

APPA Junction @ Chevella New Venture for Low Cost Fruit Plantation, Malabar Trees, Model Farm House, Farm Plots Ph: 9849096826

Adibatla ITIR Zone HMDA Approved Plots close to TCS, CTS, ORR Junction. Fully developed. Spot Regd. Loans ✆ 9618882020.

Tandur, Vikarabad Dist., Malreddy Village, Open Plot 1129 sqyds. Near Indiranagar Plot for sale. ✆ 9440883891, 8142178497.

శ్రీశైలంహైవే, కడ్తల్ ఫార్మాసిటీ, RRR కి అతి సమీపంలో నెలసరి Rs: 6 వేల సులభ వాయిదాలతో 18 మలబార్ నీమ్ మొక్కలతో కూడిన ప్లాట్స్ కలవు. Ph: 8186867777

షాద్‌నగర్ టౌన్‌లో 100 గజాలు 1,50,000/- EMI (నెలకు 5 వేలు మాత్రమే) ఫ్రీ రిజి॥ & సైట్ విజిట్ ఫ్రీ. సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd. # 73/A, 2nd ఫ్లోర్, మాస్టర్‌మైండ్స్ అపార్ట్‌మెంట్, శివబాగ్ కాలనీ, Nr.S.R.నగర్, P.S. అమీర్‌పేట్ ✆ 8185936389, 040-40246023.

కేవలం 55000తో బుకింగ్ మిగతా 36 నెలలలో చెల్లించండి. ముంబై హైవే ORR, Exit-3, మెడికల్ కాలేజ్ దగ్గర HMDA లేఅవుట్, MMTS, మెట్రో విస్తరణ, గీతం IITకి దగ్గరలో. 9390080335

అతివేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీశైలం హైవేలో ఫార్మాసిటీ & రిజనల్ రింగ్‌రోడ్‌కి దగ్గరలో 100 ఎకరాలలో అన్ని డెవ॥ మెంట్స్‌తో (ఆఫర్ Price) గ॥ కేవలం రూ॥ 399/- లకే ఫ్లాట్స్ కలవు. ✆ 9030060505

శ్రీశైలం హైవే కందుకూరు ముచ్చర్ల ఫార్మాసిటీ దగ్గర BT రోడ్‌కి ఆనుకొని ఇంజ్ ప్రక్కన, పండ్ల మొక్కలు, మలబార్ మొక్కలతో ఫార్మ్ ప్లాట్స్ ఇల్లు కట్టుకోవడానికి అనువైన ప్లాట్స్ కలవు. EMI Avbl. ✆ 7799864445.

వంగపల్లి: వరంగల్ హైవేకి 1KMలో 100Ft రోడ్ ఫేసింగ్ DTCP అప్రూవ్డ్, గేటెడ్ కమ్యూనిటీలో ప్లాట్లు కలవు. ప్రతి బుకింగ్‌పై 5 గ్రా॥ గోల్డ్- ఫ్రీ. Ph: 9951662211.

వెంచర్ క్లోజింగ్ ఆఫర్ శంషాబాద్ to షాబాద్ రోడ్‌లో గజం 999/- మాత్రమే ఫ్రీ సైట్ విజిట్. M.S ఎస్టేట్ ✆ 9949190981.

శ్రీశైలం హైవే ఆమనగల్‌హైవే ఫేసింగ్ శ్రీనివాస Dev. అలో DTCP లేఅవుట్ ముచ్చర్ల ఫార్మాసిటీ, RRR దగ్గరలో తక్కువ ధరకు ప్లాట్లు కలవు. EMI 9246370045

Adibatla HMDA ప్లాట్లు సాగర్ హైవే TCS, వండర్‌లా పార్కు, BDL దగ్గరలో All Dev. రెడీ టు కన్‌స్ట్రక్షన్, స్పాట్ రిజి॥ లోన్స్ సౌకర్యం. ✆ 9866227875.

రాజేంద్రనగర్‌కు శంషాబాద్‌కు దగ్గరలో రంగారెడ్డి జిల్లా నందు లోకల్ బస్సుల సౌకర్యంతో 100 గ॥ 1,50,000/- మాత్రమే. EMI, ఫ్రీ రిజి॥ & సైట్ విజిట్ ఫ్రీ. సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd. # 73/A, 2nd ఫ్లోర్, మాస్టర్ మైండ్స్ అపార్ట్‌మెంట్, శివబాగ్ కాలనీ, Nr.S.R.నగర్ P.S, అమీర్‌పేట్ ✆ 9849973149, 040-23739969.

ఫార్మాసిటీ ముచ్చర్ల: శ్రీశైలం హైవేకి 1KM లో 100 Acers గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో DTCP అప్రూవ్డ్ ప్లాట్స్ & ఫామ్‌ల్యాండ్స్ అవుట్‌రేట్ మరియు 40 నెలల వాయిదాలలో తక్కువ పెట్టుబడి ఒకేసారి ఎక్కువ లాభం గల ప్లాట్స్ కొరకు. ✆ 8008325552/ 8885577055

కేవలం రూ: 1,25,000/- లకే 200 చ॥గ॥ ఇంటిస్థలం హైదరాబాద్ (రామోజీ ఫిల్మ్‌సిటీ) చౌటుప్పల్ సమీపంలో NH:9, క్లియర్‌టైటిల్ స్పాట్ రిజి॥ ✆ 9948078062, 9848305444.

అతిభారీ @ బొంగ్లూరు HMDA గేటెడ్ కమ్యూనిటీ (LPNO) తో "Rich Meadows" ప్లాట్లు & ఇండ్లు అన్ని Devp.తో విశ్వేశ్వరయ్య కాలేజ్ ఎదురుగా Ph: 7306432555/ 8885937555

ఇల్లు కట్టుకోవడానికి 150 గ॥ 149 వేలకే షాద్‌నగర్ సంగారెడ్డి వికారాబాద్ 7 వేలకే బుకింగ్ మిగతా 7000x20 నెలలు సంప్ర: 9553877779.

ఇల్లు కట్టుకోవడానికి 60 గ॥ 57 వేలకే 5 వేలకే బుకింగ్ & మిగతా 4000x13 నె॥ Nr. ఎయిర్‌పోర్ట్ @ షాద్‌నగర్ నియర్ సువర్ణ భూమి సంప్ర: 9346887779.

యాదగిరిగుట్ట సమీపంలో 92 ఎ॥ DTCP లే అవుట్ నందు ఓపెన్ ప్లాట్లు కలవు. గేటెడ్ కమ్యూనిటీ, అన్ని Dev.తో స్పాట్ రిజి॥ EMI సౌకర్యం కలదు. 9885892222, 7702779248

యాదగిరిగుట్ట వరంగల్ హైవే @ వంగపల్లి J.S.R. గ్రూప్ సక్సెస్‌లో హైవే ఫేసింగ్‌కు DTCP 8 వెంచర్‌లో ప్లాట్లు కలవు. రిజి॥ + రిసార్ట్స్ మెంబర్‌షిప్ ఫ్రీ. సంప్ర: 9440697029

Nidadavole గణేష్ చౌక్ మునీ డోరా తూము రోడ్‌లో 253 గజాలు (W/F) అమ్మకానికి కలదు. E 74 W 68 N 30 S 34 Phone: 9703994466

ముద్ర రిసార్ట్స్ రూ 1818/-లకే చ॥గ॥ రామోజీ ఫిల్మ్ సిటీ చౌటుప్పల్ టోల్ ప్లాజా దగ్గర శ్రీగంధం మొక్కలతో ఫాం ప్లాట్లు & రిసార్ట్స్‌లో మెంబర్‌షిప్ ఫ్రీ సంప్ర: 8897318726

150 చ॥గ॥ ప్లాటు 15 వేలకే రిజి॥ & 6,500x16 నె॥ వాయిదాలు Nr. ఎయిర్‌పోర్ట్ @షాద్‌నగర్. Nr. సువర్ణ భూమి. ఇండ్లకు దగ్గరలో Ph: 9505298998

తక్కువ ధరకే ఇంటిస్థలం శంషాబాద్ దగ్గరలో లోకల్ బస్సుల సౌకర్యంతో 100 చ॥గ॥ 1,25,000/- మాత్రమే. డైరెక్ట్ కం ఆఫర్. R.S Estates ఫ్రీ సైట్‌విజిట్ EMI సౌకర్యం. ✆ 8790201417.

WANTED

Land/ Shed- On Lease/ Rent for Vehicle parking 10000 Sq.Ft- 12000 Sqft in around Jeedimetla Balanagar. ✆ 9908900007

JOBS

Part/Full Time Home Based On/Offline, DataEntry, Ad-Posting, Copy-Paste, SMS Send, Form Filling, Page Type Convert to Words, No Target, Earn:25-40K. 6Y.Old Govt.Reg. Co. AN ISO:9001-2015 Certified Co, Daily/Weekly Pay. Free Trng.& 9502750123/ 7095750123/ 040-42000192/ 94.

Wanted Sales Executives Managers Telecallers for A Reputed Real Estate Company Gachibowli Age-18 to 25 (yrs) Sal 10K+ Incentives. ✆ 9640158422.

Wanted Experienced Sales Girls & Salesmen for Saree Showroom at Road No.10, Banjarahills, Cont: 9866165016.

Hiring Exp. Trainers Centre Heads Placement Exe, Mobilisers, Counsellors, Skill Development. 7893799577. www.synchroserve.com

Castrol Oils, Amaron Battaries Distributer Wanted for L.B.Nagar Area-Delivery Boys,Van Driver with Badge. Immediately Contact: 9948585823. For Secunderabad Area-Delivery Boys, Helpers, Drivers with Badge, Sales Executives & Computer Operator (Perfect Experience in Tally) Contact: From 10AM to 6PM. Ph: 040-27950727, 9666664518

Wanted Field Executives for A Reputed Company @ Nagole Fixed Salary+Commission. Contact: 9985509327

Wanted Experienced B.Pharmacy, D.Pharmacy & Pharma Assistants for Fast Growing Retail Pharmacy Chain at Manikonda Area. Accomodation Free. 8886726777, 7382314566

Wanted Sales Managers for AAC Bricks at Hyd. Min: 2 Yrs Exp Related Field walk-in 2-9-2017 at Vanasthalipuram. ✆ 7981217534.

Wanted Female/ Male Residential Wardens & Female Receptionist at Himayathnagar, Hyd. Ph: 7093589327

Malik Motor -Ashok Leyland Dealer Requires 30 Field Executives/Team Leaders for Various Branches. Experience in Sale of Goods Vehicle, Buses, Institutions.Preferred at Attractive Remunerations, Freshers also Can Apply to hr@malikmotors.com

Urgently FMCG Company Require Sales Executives & Marchandisers for Kukatpally & Mehdipatnam Areas ✆ 9581234566

Wanted Experienced Computer Programmer (Telugu & English) for Gandhian College of Education for more Details: 8185844999/ 9494151919/ 98486164588

Interested In Good Earnings and Excellent Carrier We Offer the Best Cail. Hema Reddy ✆ 8074862865

Wanted Technician, Office Boy, Delivery Boy. Contact. FITLINE, Shanti Shikara, Complex, Somajiguda, Hyd. ✆ 66107070

Required 100 Delivery Boys Jublee hills, Miyapur, Rtcx, Mehdipatnam Contact: 9908589085 Vasanth

Need Techn's & Helpers for Internet Cable laying. Techn's Must Having 2 Wheeler. Salary + Incentive ✆ 7032961642/ 9100075907

Wanted Manager for Fruits and Vegtables Trading Company, Qlf: Any Degree. Contact: ✆ 7675920584

Wanted Jr. Accountant (M/F) B.Com, with Knowledge of Tally, @ Kukatpally Area. srinivasagroup99@gmail.com ✆ 040-40058060

Req Urg Field Collection Exe, For Kukatpally, Sec'bad, ECIL, Balanagar, Ameerpet, Team Leaders (2), Comp Asst (1) & Telecaller (F). Salary + Conv + Incentives ✆ 7799188669/ 9885168685

Wanted Exp Loading Clerks (Male) below 45 Yrs for Transport Company near Balaji Hospital, Kompally Ph: 040-27235226/ 27

Wanted Field Executives for Bank Collections Experience with Bike Must Required Hyderabad, Ameerpet to Kukapally ✆ 9505428222

Sr. Steel Fabricator Required For Repuetd Steel Group & Wanted Welders with Minium 3yrs Experience MFG: Facility. Dulapally ✆ 9502003001

WANTED WAREHOUSE Employs (Sorters, Pickers, Loaders) @ Shamshabad Salary 8000/-+) ESI+PF. ✆ 9133540444, 9154464481

Wanted Manager & Business Executives, Min. 5yrs Exp. in Chitfund Field & Accountant., 5yrs Exp. in Tally. For a Chitfund Company @ Lakdikapool ✆ 7660027682/ 7660027693

Wanted Ladies Stewards, Boys, Captains, Indian, Chinese, Tandoori Chefs at KPHB ✆ 9100077762/ 9100077763.

AADHAR Enrollment Work: Required Qualified Operators/ Supervisors in A.P & T.S ✆ 9334395471/ 9608247907. Mail: aadhaarutl@gmail.com

Wanted AGM- 3No's (5yrs Exp.) Sr. Mktg Managers- 5 No's (4 Yrs Exp) Mktg Managers - 5 No's Mktg Executives-10 No's Tele Mktg Executives (F) - 5 No's Good Salary + Incentives 2 Wheeler Must. Walk-in : Today & Tomorrow. Ph: 8712341144. champions@gmail.com

Required Collection Executives Urgently (DRA Certified or Non DRA) to work NBF'S Reach us on 8143708066/ 9966000012.

Urgently Required Office Assts with Comp. Knowledge (F/M). Part/Full Time. & Office Boys for Outdoor Work/Drivers.✆ 9849492570.

Marketing Executives Salary Upto: 30,000/- Audio Technician and Accounts Executive Salary: 25,000/- Contact: ✆ 7702011711

UBER BIKE TAXI: మీ 2-వీలర్‌ని ట్యాక్సీగా నడుపుతూ గంటకి 100/- సంపాదించండి. వెంటనే 040-39560690 పై కాల్ చేయండి.

డైరెక్ట్ కంపెనీ సౌత్ ఇండియాలో అతిపెద్ద సంస్థ M/F (పార్ట్/ ఫుల్‌టైం) మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను & Govt/ Pvt ఎంప్లాయిస్/ గృహిణులు కూడా సంప్ర॥ Age: 25Y పైన, 9951381717/ 9573721956.

ఫ్లోరిడా/ టికిలీ ప్యాకింగ్‌చేస్తూ రోజు రూ॥2500/- స్త్రీ/పు॥ సంపాదించుకోవచ్చు (హోం డెలివిరి) ధనశ్రీ నాంపల్లి ✆ 9030444383, 9704086431.

కొండాపూర్‌లో కొత్తగా ప్రారంభం కానున్న రెస్టారెంట్‌కి దోశ మాస్టర్స్, పూరి మాస్టర్స్, చట్నీ రుబ్బింగ్ మాస్టర్స్, అసిస్టెంట్ కుక్‌లు, స్టెవార్డ్స్ కెప్టెన్ సూ॥ వైజర్ లేడి స్టీవర్డ్స్ కావలెను. ✆ 8686146906

సికింద్రాబాద్ కాల్‌సెంటర్ వెంటనే కావలెను. P/F టైం, డే/ నైట్ షిఫ్ట్స్ M/F వ: 18-30, మంచిజీతం. # 335, 3rd ఫ్లోర్, చంద్రలోక్ కాంప్లెక్స్, C-బ్లాక్, ప్యారడైజ్ 9966342711.

30సం॥ల అనుభవం గల కన్‌స్ట్రక్షన్ కంపెనీ కొరకు అనుభవం గల మార్కెటింగ్ మేనేజర్స్ డెవలప్‌మెంట్ మేనేజర్స్ జనరల్ మేనేజర్స్ కావలెను. టీమ్‌లీడర్స్ హౌస్‌వైఫ్స్ & రిటైర్డ్ ఎంప్లాయిస్‌కి ప్రాధాన్యత. సంప్ర: 9885169696.

TV11 న్యూస్ ఛానెల్‌కు అనుభవం ఉన్న న్యూస్‌రీడర్స్ కం స్క్రిప్ట్‌రైటర్, వాయిస్‌ఓవర్, వీడియో ఎడిటర్స్, ఏరియా రిపోర్టర్స్, సిస్టమ్ అడ్మిన్ కావలెను. ✆ 9390022214

"సువర్ణావకాశం" - మీరు VRS/ రిటైర్ అయ్యి బోర్ ఫీలౌతున్నారా? మరలా మేనేజర్‌గా పనిచేస్తూ నెలకు 40,000/- ఆపైన సంపాదన కొరకు సంప్ర॥- స్త్రీలకు ప్రత్యేక విభాగంకలదు. విమలా AGM. Ph: 9866522421/ 9032562646

స్పాట్‌జాయినింగ్, జీతం: 18,000/- అర్జంటుగా ప్రముఖ ఏజెన్సీలకై 300 ఖాళీ పోస్టులకై M/F స్టాఫ్, P/F టైం, ఆల్ ఏరియాస్. Q: 10th - P.G, Age: 18-35Y, Ph: 8897511523

డైరెక్ట్ జాబ్. స్పాట్ జాయినింగ్. ప్రముఖ Ltd కంపెనీలో హెల్పర్స్ ప్యాకింగ్ బాయ్స్ సూపర్‌వైజర్స్ ఆఫీస్ బాయ్స్, ITI (ఆల్) కావలెను. జీ. 11-17 వేలు, ఫ్రీ రూం, మీల్స్ చదువులేకున్నా జాబ్. ✆ 9705874656

రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు రి॥ ఎ॥ అనుభవం గల కమీషన్ బేసిస్‌లో మార్కెటింగ్ మేనేజర్స్ టీ॥ కాల్స్ GM, AGM, MM, MO, SE కావలెను. 9346887779

బాలానగర్, R.C.Puram, మదీనాగూడ ఏరియాలలో డెలివరీ చేయుటకు కొరియర్ బాయ్స్ కావలెను. 2 వీలర్ Must, జీ॥ 10K + పెట్రోల్ + ESI + PF, సంప్ర: 9030411877

అర్జెంటుగా డైరెక్ట్ (తెలుగు) మాట్లాడే కాల్‌సెంటర్‌కి M/F స్టాఫ్, DSNR, ఉప్పల్, సి॥బాద్, అమీర్‌పేట్, ECIL, KPHB, MP, B.హిల్స్ హైటెక్‌సిటీ, P/F, D/N జీ. 14-25K Q: 10th - PG ✆ 7032473870

కెప్టెన్స్, డెలివరీ బాయ్స్ కావలెను. మయూరి బార్ & రెస్టారెంట్, ఉప్పల్. అనుభవము బట్టి జీతం. Ph: 8341437483/ 8309807442

హెల్త్ ఇన్సూరెన్స్ చేయుటకు Experience ఉన్న టెలికాలర్స్ కావలెను జీతం: 10K to 15K చిక్కడపల్లి ✆ 9394656566/ 9010802001

ప్రముఖ కంపెనీ బేగంపేట నందు పనిచేయుటకు టెలికాలర్స్ Females కావలెను. జీతము+ ఇన్సెంటివ్స్ Ph: 9032422650.

బాలానగర్‌లోని వరిష్ఠ మోటార్స్ (3 వీలర్స్ డీలర్‌షిప్) నందు పనిచేయుటకు మెకానిక్ ఎలక్ట్రీషియన్, ఆఫీస్ బాయ్స్, క్యాషియర్ & సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. సంప్ర శ్రీహరి. 9991851111

5&3 స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్/ గర్ల్స్ కావలెను. గర్ల్స్ 600-1200/- బాయ్స్ 400-800/- P/F టైం రూం+మీల్స్ స్పాట్ పేమెంట్ ✆ 8187872321/ 7995280048

రాఘవ ఆటోఫైనాన్స్‌లో పనిచేయుటకు అనుభవం గల ఎగ్జిక్యూటివ్స్ & వెహికల్ సీజర్స్ కావలెను @ నాంపల్లి. సంప్ర॥ ✆ 7680880500/ 9100204445.

గణపతి పందిళ్లు.. కళల పరవళ్లు!

జోరుగా సంగీత, నృత్య కార్యక్రమాలు ● పిల్లలకు బహుమతులతో ప్రోత్సాహం

ఈనాడు, హైదరాబాద్

నగరంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జోరుగా సాగుతున్నాయి. చాలా వీధుల్లో, బహుళ అంతస్తుల భవనాల్లో వినాయకుడి మండపాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో కొన్నింటివద్ద సాయంత్రం సమయంలో పిల్లలతో సంగీత, నృత్య, పాటల పోటీలను నిర్వహిస్తున్నారు. మరికొన్ని మండపాల వద్ద విద్యార్థులకు పెయింటింగ్, క్విజ్ వంటి అంశాల్లో పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. అద్భుత ప్రతిభ కనబరిచిన వారికి గణేశ్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు బహుమతులను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎక్కువ మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. విద్యార్థుల ప్రతిభ ప్రదర్శించేందుకు గణపతి మండపాలు ఒక చక్కటి వేదికగా నిలుస్తున్నాయని నిర్వాహకులు వెల్లడిస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్, శ్రీకృష్ణనగర్, చైతన్యపురి, చందానగర్, అమీర్‌పేట, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో గత నాలుగురోజులుగా విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

కళకళలాడుతున్న మండపాలు..

సాయంత్రం అవుతుందంటే చాలు నగరంలోని పలు గణపతి మండపాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. కొన్నింటిలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ జనాన్ని విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే గత కొన్నేళ్లుగా మట్టి గణపతులను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచిన ఉత్సవ కమిటీలు.. విద్యార్థులు, పిల్లలను ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టాయి. చిత్రలేఖనం పోటీల్లో గణపతి రూపాల్ని అద్భుతంగా వేసిన పిల్లలకు పలుప్రాంతాల్లో బహుమతులను అందజేస్తున్నారు. కాలనీల్లోని పలు గణపతి విగ్రహాల వద్ద ఈతరహా పోటీలు పిల్లలకు నిర్వహిస్తూ ఆకట్టుకుంటున్నారు. పిల్లలను వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పంపిస్తున్నారు. నిర్వాహకులు వివిధ పోటీల్లో గెలిచిన పిల్లలకు వారికి ఉపయోగపడే వస్తువులను ఇస్తున్నారు.



చందానగర్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో విజేతలు

గణపతి లడ్డూకి లక్కీ లాటరీ..

నగరంలోని కొలువు దీరిన గణపతుల వద్ద ప్రసాదంగా ఉంచే లడ్డూకి చాలా డిమాండ్ ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో వినాయకుడి లడ్డూ ప్రసాదం రూ.లక్షల్లో పలుకుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కొందరు ఉత్సవ కమిటీల నిర్వాహకులు లాటరీలను నిర్వహిస్తున్నారు. గణపతిని దర్శించుకొన్న భక్తులకు లాటరీ టిక్కెట్లను నిర్వాహకులు అమ్ముతున్నారు. ఒక్కో టికెట్టు ధర రూ.50 నుంచి రూ.వంద వరకు ఉంటోంది. కొందరైతే రూ.20లకే అమ్ముతున్నారు. వాస్తవానికి లాటరీలను నిర్వహించడం చట్టరీత్యానేరం. అయితే గణపతి ఉత్సవాల్లో ఎవరికీ లాభాపేక్ష, మోసం చేసే ఉద్దేశం ఉండదని పోలీసులు ఇలాంటివాటిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని పలు గణపతి మండపాల వద్ద లడ్డూకి లాటరీలు ఎక్కువగా నిర్వహిస్తుండగా.. మరికొన్ని విగ్రహాల వద్ద కొత్త ద్విచక్ర వాహనాలకు లాటరీ టికెట్లు అమ్ముతున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఒక మండపం వద్ద భక్తులకు ద్విచక్ర వాహనానికి లాటరీ టికెట్లు అమ్ముతున్నారు. దీనిని భక్తులు ఆసక్తిగా తిలకించి కొనుగోలు చేస్తున్నారు.



ఫియట్ క్రిస్లర్ ఆటోమొబైల్స్ ఇండియా నగర డీలర్ ప్రైడ్ ఎఫ్‌సీఏ తన 100వ, 101వ జీప్ కంపాస్ వాహనాలను వినియోగదారులకు అందజేసింది. ఆయా సంస్థల ప్రతినిధులు సురేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అన్వేష్ పాల్గొన్నారు.



కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం(సీపీఎస్)ను నిరసిస్తూ సెప్టెంబర్ 1న వాణిజ్య పన్నుల శాఖ హైదరాబాద్ రూరల్ డివిజన్ ఉద్యోగులు సామూహిక సెలవు పెట్టనున్నారు. ఆ మేరకు జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హరికాంత్, క్రాంతి యాదవ్, కిరణ్ రెడ్డి, అరుణ్, నందు తదితరులు పాల్గొన్నారు – ఈనాడు, హైదరాబాద్



శైలజాదేవి సన్మాన కార్యక్రమంలో స్వామిగౌడ్

ఉద్యమంలో మహిళల వీరోచిత పోరాటం: స్వామిగౌడ్

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో మహిళా ఉద్యోగులు వీరోచితంగా పోరాడారని రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్ తెలియచేశారు. తెలంగాణ ఉద్యమంలో శైలజాదేవి పోషించిన పాత్ర కీలకమని తెలియచేశారు. టీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.శైలజాదేవి పదవీ విరమణ ఆత్మీయ అభినందన సభను బుధవారం నాంపల్లిలోని టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్వామిగౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన ఛైర్మన్ దేవీప్రసాద్‌రావు, టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రాజేందర్, నగర అధ్యక్షుడు ముజీబ్ హుస్సేన్, టీజీఓ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణాయాదవ్ తదితరులు ఆమెను సత్కరించారు.

గ్రేటర్‌లో సాధారణ వర్షపాతం

ఈనాడు, హైదరాబాద్: నగరంలో ఆగస్టు నాటికి సాధారణ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో సాధారణం కంటే 16 శాతం అధికంగా కురవగా.. రంగారెడ్డి జిల్లాలో 9 శాతం తక్కువగా వాన పడింది. 19 శాతం వరకు ఎక్కువ తక్కువలను వాతావరణ శాఖ సాధారణంగా పరిగణిస్తుంది. జూన్‌లో వర్షాలు బాగానే పడినా.. జులై, ఆగస్టు ఆఖరు వరకు నగరవాసులతో దోబూచులాడాయి. నెలాఖరులో ద్రోణి ప్రభావంతో ఒకే రోజు 12 సెం.మీ. కురవడంతో లోటు కాస్త సాధారణానికి చేరింది. అయినా భూగర్భ జలాలు పెద్దగా పెరగలేదు. నగర వార్షిక వర్షపాతం 82 సెం.మీ.గాను ఇప్పటివరకు 66 సెం.మీ. కురిసింది.
హైదరాబాద్‌లో.. జిల్లాలో జూన్ నుంచి ఆగస్టు నెలాఖరు వరకు కురవాల్సిన సగటు వర్షపాతం 471.2 మిల్లీమీటర్లు కాగా ఇప్పటికి548.4 మి.మీ. కురిసింది.
రంగారెడ్డిలో.. ఇక్కడ జూన్ నుంచి ఆగస్టులో ఇప్పటివరకు కురవాల్సిన సగటు వర్షపాతం 472.2 మిల్లీమీటర్లకు గాను 427.6 మి.మీ. మాత్రమే పడింది.

ఓటరు కావాలంటే.. నోటు ఇవ్వాలి

ఈనాడు, హైదరాబాద్: ఓటరు సవరణ సర్వేలోనూ అవినీతి వెలుగుచూస్తోంది. ఈ ఘటన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆనంద్ రావు ఫిర్యాదుతో బుధవారం వెలుగులోకి వచ్చింది. జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి సమీపంలో ఆనంద్‌రావు నివాసం ఉంటున్నారు. ఆయన ఇంటికి సర్వేకి వెళ్లిన పోలింగ్‌బూత్ సిబ్బంది ఇలియాస్ హుస్సేన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఆ ఇంటి ప్రాంగణంలో నివాసముండే పనివాళ్లలో తొమ్మిది కొత్త ఓటర్లను గుర్తించారు. వారందరినీ ఓటరు జాబితాలో చేర్చాలంటే ఒక్కొక్కరు రూ.200ల ఇవ్వాలని ఇలియాస్ హుస్సేన్ అడిగాడు. వెంటనే ఓ వ్యక్తి ఐఏఎస్ అధికారికి ఫిర్యాదు చేయడంతో ఆయన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన కమిషనర్ బి.జనార్దన్‌రెడ్డి ఆ ప్రాంతంలో ఓటరు సవరణ చేస్తున్న ఏజెన్సీకి షోకాజు నోటీసు జారీ చేశారు. డబ్బులు అడిగిన వ్యక్తిపై, ఏజెన్సీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏకదంతా.. నమో నమామి!


నగర వ్యాప్తంగా వినాయక చవితి సంబరాల జోరు కొనసాగుతోంది. వివిధ ప్రత్యేకతలతో కొలువుదీరిన గణపతులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డులో రోజంతా నిమజ్జనాల సందడి సాగుతోంది. చిన్నాపెద్దా అందరూ ఉత్సాహంగా సంబరాలతో తరలివస్తున్నారు



ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం వద్ద యువతుల సందడి



శాలిబండలో కొలువదీరిన ముత్యాల గణేశుడు



అరుంధతికాలనీ వేంకటేశ్వరస్వామి అవతారంలో గణపతి



పాతబస్తీ శ్రీరాంనగర్‌కాలనీలో బహుచేతుల గణేశుడు



రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టలలో మట్టిగణపతి, మూషిక రాజానికి పసుపుతో అలంకరణ




లాల్‌దర్వాజ మోడ్ వద్ద శ్రవణకుమారుడిగా వినాయకుడు



గౌలిపుర కుమ్మరివాడిలో జెండా ఎగురవేస్తున్న గణేశ్



గౌలిపురలో జైజవాన్ గణేశ్



అంబికానగర్‌లో కాగితంతో రూపుదిద్దుకున్న విఘ్నేశుడు



అర్ధరాత్రి వేళ.. హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనోత్సవంలో భక్తజన సందోహం



హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనోత్సవానికి గణపతితో తరలిన యువ బృందం హుషారు



బాగ్‌లింగంపల్లిలో బాహుబలిగా గజాననుడు



సోమాజిగూడలోని రామాంజనేయ యూత్ అసోసియేషన్ ఆరువేల వక్కలతో రూపొందించిన గణేశ విగ్రహం

గణేష్ ఉత్సవాలకు పటిష్ఠ భద్రత

నిమజ్జన ఊరేగింపు మార్గాన్ని పరిశీలించిన పోలీసు, జీహెచ్ఎంసీ కమిషనర్లు



గుర్రం చెరువుకట్ట రహదారిని పరిశీలిస్తున్న సీపీ మహేందర్‌రెడ్డి



బాలాపూర్‌లో పర్యటించిన గ్రేటర్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి

కేశవగిరి, కంచన్‌బాగ్, చార్మినార్, బాలాపూర్: వచ్చేనెల 5న జరిగే సామూహిక గణేశ్ నిమజ్జన ఊరేగింపు సాగే బాలాపూర్-హుస్సేన్‌సాగర్ రూటును నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిలు అధికారుల బృందంతో కలిసి బుధవారం సమీక్షించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక బస్సులలో పోలీసు, బల్దియా అధికారులతో కలిసి వేర్వేరుగా పాతబస్తీ చాంద్రాయణగుట్ట, కేశవగిరి, గుర్రం చెరువు కట్ట, బాలాపూర్ వరకు పర్యటించారు. ప్రతిష్టాత్మకమైన బాలాపూర్ వినాయకుడి ఊరేగింపు సాగే హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల మధ్యలోని గుర్రం చెరువుకట్టపై పరిశుభ్రతా చర్యలను మొదట జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు. ఆయన వెంట బల్దియా దక్షిణ మండలం జోనల్ కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ ఘయాసుద్దీన్, ఏసీ సయాద్ తదితరులు ఉన్నారు. ఆ వెనుకే నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి గుర్రం చెరువు కట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. బాలాపూర్, చాంద్రాయణగుట్ట ఠాణాలకు పొలిమేర్లలో ఉన్న గుర్రం చెరువు కట్టపై నుంచి బాలాపూర్ వినాయకుడి ఊరేగింపు సాగే నేపథ్యంలో అక్కడ భద్రతా చర్యలను అధికారులతో సీపీ పర్యవేక్షించారు. గుర్రం చెరువుకట్టపై బార్కస్‌కు చెందిన టీం బక్రీద్ సంస్థ ప్రతినిధులను సీపీ మహేందర్‌రెడ్డి కలుసుకున్నారు. అనంతరం సీపీ బాలాపూర్ గణేశ్ మండపానికి చేరుకున్నారు. సీపీ వెంట అదనపు సీపీ (శాంతిభద్రతలు) వి.వి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ జాయింట్ సీపీ రవిందర్, స్పెషల్ బ్రాంచ్ జాయింట్ సీపీ ప్రమోద్ కుమార్, ట్రాఫిక్ డీసీపీ ఎ.వి.రంగనాథ్, దక్షిణ మండలం డీసీపీ వి.సత్యనారాయణ, ఫలక్‌నుమా ఏసీపీ మహ్మద్ తాజుద్దీన్ అహ్మద్, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ వై.ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాలాపూర్ గణేశుని పూజలో...

నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి ఇతర పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధర్‌రెడ్డి తదితర అధికారులు బాలాపూర్ గణేశ్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని మండప నిర్వాహకులు శాలువలతో సన్మానించి లడ్డూ ప్రసాదం అందజేశారు.

జంట పండుగలకు భారీ ఏర్పాట్లు
– జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి

గణేశ్ నవరాత్రులు, నిమజ్జన ఊరేగింపులు, బక్రీద్ పండుగల కోసం భారీ ఏర్పాట్లు చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి చెప్పారు. నిమజ్జన ఊరేగింపు సాగే రూటును పర్యవేక్షించిన అనంతరం జనార్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పోలీసులు, ట్రాఫిక్ విభాగం అధికారులతో కలిసి నిమజ్జనం, బక్రీద్ పండుగల కోసం సకల ఏర్పాట్లు పూర్తిచేసినట్లు బల్దియా కమిషనర్ వెల్లడించారు. బాలాపూర్-హుస్సేన్‌సాగర్ రూటులో నిమజ్జనం నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రహదారులపై గుంతలు లేకుండా, పారిశుధ్యం సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక సిబ్బందిని నియోగించినట్లు తెలిపారు. విగ్రహాలకు అడ్డు తగిలే చెట్ల కొమ్మలను సైతం తొలగించే పనులు చేపట్టామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ఠ బందోబస్తు
– సీపీ మహేందర్‌రెడ్డి

పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో వచ్చే నెల 5న జరిగే సామూహిక గణేశ్ నిమజ్జన ఊరేగింపునకు పటిష్ఠ బందోబస్తును కల్పిస్తున్నామని నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. నిమజ్జన రూటు పర్యవేక్షణలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సామూహిక నిమజ్జన ఊరేగింపు కోసం జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు. పోలీసు స్టేషన్, డివిజన్, జోనల్, కమిషనర్ స్థాయిల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటితో భద్రతను పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక పోలీసు బలగాలు నగరానికి చేరుకున్నాయన్నారు. నవరాత్రి ఉత్సవాలు, బక్రీద్ కలిసి రావడంతో మరింతగా శాంతిభద్రతలపై దృష్టి పెట్టామన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ కమిషనర్‌తో కలిసి చర్యలు చేపడుతున్నామన్నారు.

వినాయక నిమజ్జనోత్సవం వేళ..

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

రాయదుర్గం: వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ కమిషనర్ సందీప్ శాండిల్య ఉత్తర్వులు జారీచేశారు. సెప్టెంబరు 5వతేదీ ఉ. 6గంటల నుంచి 6వతేదీన ఉదయం 6గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. వివరాలివీ...

హస్మత్‌పేట జలాశయం వద్ద.. బోయిన్‌పల్లి తదితర కాలనీలనుంచి వినాయక విగ్రహాలతో వచ్చే వాహనాలు అంజయ్యనగర్ మీదుగా హస్మత్‌పేట చెరువుకు చేరుకోవాలి. నిమజ్జనం అయ్యాక ఖాళీ వాహనాలు ఓల్డ్ బోయిన్‌పల్లి, మసీదురోడ్డు, హరిజనబస్తీమీదుగా గమ్యస్థానాలకు వెళ్లాల్సి ఉంటుంది.

ఐడీఎల్ తటాకం వద్ద.. సందర్శకుల వాహనాలను ఐడీఎల్ చెరువువద్దకు అనుమతించరు. ● గోద్రెజ్, జేఎన్‌టీయూ వైపునుంచి గణేష విగ్రహాలతో వచ్చే వాహనాలు ఐడీఎల్ కూడలివద్ద మలుపు తీసుకుని తటాకానికి రావాలి. నిమజ్జనం పూర్తిచేశాక వాహనదారులు రెయిన్‌బో విస్టా వైపువచ్చి నైనాగార్డెన్ మీదుగా వెళ్లాలి. ● 5వ తేదీన ఐడీఎల్ చెరువు ప్రవేశ ద్వారం నుంచి రెయింబో విస్టా టీజంక్షన్ వరకు రోడ్డును మూసివేస్తారు.

ఫ్లైఓవర్‌లపై రాకపోకలు బంద్... భద్రతా పరమైన కారణాలతో బాలానగర్, బల్కంపేట, సనత్‌నగర్ వైపునుంచి గణేష ప్రతిమలతో వచ్చే వాహనాలను ఫతేనగర్ ఫ్లైఓవర్‌పైనుంచి వెళ్లేందుకు అనుమతించరు. ● మాదాపూర్ సైబర్ టవర్ ఫ్లైఓవర్, గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పైనా అనుమతి ఉండదు.

భారీ వాహనాలపై ఆంక్షలు... బాలానగర్‌నుంచి ఫతేనగర్ బ్రిడ్జి, గోద్రెజ్ నుంచి ఎర్రగడ్డ, మియాపూర్‌నుంచి గోద్రెజ్, ఫెరోజ్‌గూడ నుంచి గోద్రెజ్, గుడన్‌మెట్ నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు భారీ వాహనాలను అనుమతించరు. ● ఆరాంఘర్ చౌరస్తా నుంచి బహదూర్‌పురా వైపు ఆర్టీసీ బస్సులను వెళ్లనివ్వరు.



శ్రీ సిద్ధి వినాయక్ అసోసియేషన్ ప్రతిష్ఠించిన గణేశుడిని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, అఖిల్ యాదవ్, రాకేష్ తదితరులు దర్శించుకున్నారు. –న్యూస్‌టుడే, కేశవగిరి

తుగ్లక్ పాలనను తలపిస్తున్న కేసీఆర్ పరిపాలన
- భాజపా నేత ఇంద్రసేనారెడ్డి

గన్‌ఫౌండ్రి: కేసీఆర్ పరిపాలన తుగ్లక్‌ను తలపిస్తోందని భాజపా జాతీయ నేత ఎన్.ఇంద్రసేనారెడ్డి విమర్శించారు. పూటకో నినాదం ఇస్తూ... పూటకో ప్రకటన చేయడమే దీనికి నిదర్శనమన్నారు. ఈ మేరకు బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని, తహసీల్దార్లకే బాధ్యతలు అప్పగిస్తామని ముఖ్యమంత్రి మాట్లాడటం ప్రజలను మోసం చేసేందుకు, మభ్య పెట్టేందుకేనని దుయ్యబట్టారు. ఇష్టానుసారంగా 31 జిల్లాలను ఏర్పాటు చేసి, సరైన మౌలిక వసతులు కల్పించకుండా, అధికారులను నియమించకుండా, భవనాలను కేటాయించకుండా పరిపాలనను అస్తవ్యస్తం చేశారని ధ్వజమెత్తారు. జీఓ 39 ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, భూమి హక్కులను హరిస్తున్నారని, గ్రామాలలో భౌతికంగా రికార్డులను తనిఖీ చేయకుండా ఒక దగ్గర కూర్చుని ఎలా తయారు చేస్తారని ప్రశ్నించారు.

విగ్రహాల వద్ద విధిగా విద్యుత్తు సిబ్బంది
గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై డిస్కం సీఎండీ సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: పది అడుగులు, ఆపైన ఎత్తు ఉన్న విగ్రహాల ఊరేగింపు గల్లీల నుంచి ప్రధాన మార్గం చేరేవరకు సిబ్బందిలో కనీసం ఒకరైనా విగ్రహం వద్ద అందుబాటులో ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎండీ జి.రఘుమారెడ్డి ఆదేశించారు. గణేశ్ నిమజ్జనంలో విద్యుత్తు ప్రమాదాలకు తావు లేకుండా.. సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ఇంజినీర్లను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో సెప్టెంబరు 5న జరిగే నిమజ్జనానికి విద్యుత్తు ఏర్పాట్లపై బుధవారం మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎంలు, ఎస్‌ఈలతో సమీక్షించారు. ● సూపరింటెండెంట్ ఇంజినీర్లు తమ సర్కిళ్లలోని నిమజ్జన ప్రాంతాలను స్వయంగా పర్యవేక్షించాలి. ● గణేష్ విగ్రహాల శోభాయాత్ర నిర్వహించే ప్రాంతాల్లో పర్యటిస్తూ లైన్లపై నున్న చెట్ల కొమ్మలు కొట్టడం, వదులుగా ఉన్న తీగలను సరిచేయడం, బ్రేకర్స్, రోడ్డు క్రాసింగ్‌ల వంటి పనులను తనిఖీ చేయాలి. ● డివిజన్ స్థాయిలో ఉండే లైన్ సిబ్బంది, సెంట్రల్ బ్రేక్‌డౌన్ సిబ్బంది, ఆపరేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి. ● సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో మండపాల వద్ద విధిగా ఉండాలి. నిర్వాహకులకు తమ ఫోన్‌నెంబర్లను తెలియజేయాలి. ● శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లోని ఇనుప స్తంభాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఆ ఇనుప స్తంభాలపై గల విద్యుత్తు తీగలకు సరైన ఇన్సులేషన్ ఏర్పాటు చేయాలి. ● నిమజ్జనం కోసం హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో 2 కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయబోతున్నారు. 5వ తేదీ నిమజ్జనం పూర్తయ్యే వరకు డైరెక్టర్లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్‌రెడ్డి, మీర్ కమాలుద్దీన్ అలీఖాన్ కంట్రోల్ రూంల నుంచి విద్యుత్తు పరిస్థితిని పర్యవేక్షిస్తారు. ● హుస్సేన్‌సాగర్ వద్ద మూడు ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా 20 వరకు 500 కేవీఏ సామర్థ్యం కల్గిన నియంత్రికలను అందుబాటులో ఉంచనున్నారు. ట్యాంకుబండ్ దిగువన, ఎన్టీఆర్ మార్గ్ వద్ద, సమీప ప్రాంతాల్లో 315కేవీఏ సామర్థ్యంగల 3 పంపిణీ నియంత్రికలను అత్యవసర సమయాల్లో ఉపయోగించే విధంగా అందుబాటులో ఉంచనున్నారు. ● స్టోర్ సిబ్బంది నిమజ్జనం పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయి అధికారులకు అందుబాటులో ఉండి వారి అభ్యర్థన మేరకు విద్యుత్తు పరికరాలను అందించాలని ఆపరేషన్ డైరెక్టర్ జె.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు.



నాయిని నర్సింహారెడ్డిని సన్మానించిన ప్రధాన న్యాయమూర్తిని ఎల్.నర్సింహారెడ్డి

'పండగలు ఐక్యతకు నిదర్శనం'

జహనుమా, న్యూస్‌టుడే: నగరంలో జరిగే ప్రతి పండగ ఐక్యతకు నిదర్శనమని రాష్ట్ర హోంమంత్రి నాయినీ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన పాతబస్తీ చార్మినార్ సెగ్మంట్ పరిధి పురానిహవేలిలోని సిటీసివిల్‌కోర్టులోని బార్ అసోసియేషన్ ఆధ్వరంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలోని ప్రత్యేక పూజలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజలు పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పండుగలను దృష్టిలో ఉంచుకుని పోలీస్‌శాఖ పట్టిష్ఠ బందోబస్తులను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎల్.నర్సింహారెడ్డి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి పి.వి.రాములు, బార్ అసోసియేషన్ బార్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ సెక్రటరి కె.హరిమోహన్‌రెడ్డి, సెక్రటరీ గిరిధర్‌రెడ్డితోపాటు బార్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



- చక్కని ఆహార్యం.. మెరుగైన సౌకర్యం
- కుర్రకారు కొత్త పోకడలకు పెద్దలూ సై

షార్ట్ ఫ్యాషనేంది

ఈనాడు, హైదరాబాద్

కాలానుగుణంగా ఫ్యాషన్లు మారుతుంటాయి. వాతావరణాన్ని బట్టి సౌకర్యంగా ఉండే వాటిని ఎక్కువ మంది ఇష్టపడుతుంటారు. అవసరాలు కూడా నగరవాసుల ఆహార్యంలో చాలా మార్పులు తీసుకొస్తున్నాయి. పెద్దలు ఆంక్షలు పెడుతున్నా.. ప్రధానంగా కుర్రకారు కొత్త పోకడలకు ఆద్యులవుతున్నారు.

షార్ట్స్ వేసుకుంటే ఇదివరకు ఇంటి గడప దాటేవారు కాదు.. కొంతకాలం క్రితం వరకు వీటిని ధరించి వీధి చివరి వరకు వచ్చేవారు.. ఇప్పుడు మాల్స్‌కు వెళుతున్నారు.. థియేటర్లకు, ఆసుపత్రులకు వస్తున్నారు.. బస్సుల్లో ప్రయాణిస్తున్నారు.. ఇప్పుడు కార్యాలయాల్లోనూ కనబడుతున్నారు. కుర్రకారు నుంచి మొదలైన ఈ పోకడను మిగతా వర్గాలు అనుసరిస్తున్నాయి. పెద్దవాళ్లు సైతం షార్ట్స్‌తో కుర్రకారుతో పోటీపడుతున్నారు. తామూ యువకులమే అంటున్నారు.

కార్యాలయాలకు వెళుతున్నారు.. బహుళ జాతి సంస్థల రాకతో నగరంలోని ఉద్యోగుల జీవనశైలిలో చాలా మార్పులు చూశాం. పగలు రాత్రి తేడా లేకుండా పనిచేయడం, వేళాపాళా లేకుండా తినడం.. అందునా జంక్‌ఫుడ్‌కు అలవాటు పడటం.. చెబుతూ పోతే చాలానే ఉన్నాయి. ఇలా ఒక్కొక్కటిగా పాశ్చాత్య సంస్కృతి మన దగ్గరకు దిగుమతి అవుతోంది. ఉద్యోగుల ఆహార్యం ఇందుకు మినహాయింపు కాదు. కార్యాలయంలో ఉద్యోగులు షార్ట్స్ ధరించేందుకు కంపెనీలు అభ్యంతర పెట్టడం లేదు. హుందాగా ఉండేలా చూసుకోమంటున్నాయి. వానాకాలం వీటిని ధరించి కార్యాలయానికి వచ్చేవారు పెరుగుతున్నారు. నగరంలోనూ ఈ పోకడ క్రమంగా విస్తరిస్తోంది. మాదాపూర్ రహేజా పార్కులోని, గచ్చిబౌలిలోని కొన్ని ఐటీ కార్యాలయాలకు వెళితే షార్ట్స్‌తో వచ్చే ఉద్యోగులను చూడొచ్చు. చాలా కంపెనీల్లో ఇప్పటికే వారం మొత్తం ఫార్మల్స్ తప్ప మిగతా దుస్తులను అనుమతించరు. మిగతా కంపెనీల్లో శుక్రవారం ఒక్కరోజు క్యాజువల్స్‌ను అనుమతిస్తున్నారు. క్రమంగా ఇది షార్ట్స్ వరకు వచ్చింది.

హుందాగా ఉండేలా.. వేషధారణ ఏదైనా నలుగురిలో తిరిగేటప్పుడు హుందాగా ఉండేలా చూసుకోవాలంటున్నారు పెద్దలు. అమ్మాయిలు ధరించడంపై ఇప్పటికీ అభ్యంతరాలు ఉన్నాయి. విదేశీ పర్యాటకులు వచ్చినప్పుడు ఆహార్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతుంటారు. అబ్బాయిల వరకు ఇంట్లో అమ్మా నాన్న హెచ్చరిస్తున్నా.. వీరు మాత్రం ఇదే సౌకర్యం అంటూ తిరిగేస్తున్నారు.

ఫ్యాషన్ డిజైనర్ల సూచనలు..

షార్ట్స్ వేసుకుంటే వాటికి జత కూడా కుదరాలి అంటున్నారు ఫ్యాషన్ డిజైనర్లు. అప్పుడే అందరి ఆమోదం ఉంటుందని చెబుతున్నారు. షార్ట్స్ మోకాలును తాకుతున్నట్లుగా ఉండాలని, వీటిపై షీ షర్ట్, కాళ్లకు స్లిప్పర్లు, స్పోర్ట్స్ షూస్ లాంటివి ధరిస్తే చూపులకు బాగుంటుందని చెబుతున్నారు.

ఎక్కువ మంది ఆదరణ..

దుస్తులు ఏవైనా ధరిస్తే సౌకర్యంగా ఉండాలి.. స్టైల్ కూడా ముఖ్యమే. ఇదివరకు మొదటి దానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇప్పుడు రెండూ ముఖ్యమే అంటున్నారు ఈతరం. షార్ట్స్‌నే తీసుకుంటే ఇదివరకు సాదాసీదాగా ఉండేవి. ధరించి బయటకు రావడానికి అంత సౌకర్యంగా ఉండేవి కావు. మార్కెట్లో లభ్యత కూడా తక్కువే. ప్రస్తుతం ఫ్యాషన్ రంగంలో ఇదే పెద్ద మార్కెట్. డిజైనర్ దుస్తులు వచ్చాయి. వీటిని ధరించి ఎక్కడికైనా వెళ్లొచ్చు అనేలా షార్ట్స్ వచ్చాయి. పైగా హుందాగా కూడా ఉండటంతో క్రమంగా ఎక్కువ మంది ఆదరణ పొందుతున్నాయి. మార్కెట్లో జీన్స్ పాయింట్ల కంటే వీటి ధరలే ఎక్కువ ఉన్నాయంటే ఆశ్చర్యం కలగకమానదు.






కట్టుబాట్ల నుంచి..

ఆహార్యం విషయంలో మనకు కొన్ని కట్టుబాట్లు ఉన్నాయి. ఇప్పటివరకు వీటికి కట్టుబడే మనవాళ్ల వస్త్రాలంకరణ సంప్రదాయంగా ఉండేది. ఆదాయాలు, వినిమయ సంస్కృతి. . పాశ్చాత్య ధోరణులు పెరగడం, ప్రసార మాధ్యమాల ప్రభావంతో క్రమంగా విదేశీ పోకడలకు ఆకర్షితులు అవుతున్నారు. అన్నింటికీ మించి మారిన మన అవసరాలకు తగ్గట్టుగా ఆహార్యంలో మార్పుల అవసరం వచ్చిందంటున్నారు ఫ్యాషన్ డిజైనర్లు. బైకుపై లుంగీ కట్టుకుని నడపలేం కదా, వానలో ప్యాంట్‌తో వెళ్లలేం కదా అని కుర్రకారు తమ ఆహార్యాన్ని సమర్థించుకుంటున్నారు.



సీనియర్లు దిక్సూచిగా నిలవాలి



- కొత్త విద్యార్థుల ఆశలకు భరోసా ఇవ్వాలి
- కళాశాలల్లో ఇంకా పొడ చూపుతున్న ర్యాగింగ్
- చట్టాలు ఉన్నా ఆచరణకు నోచని నిబంధనలు

న్యూస్‌టుడే, ఘట్‌కేసర్

కళాశాలల్లో జూనియర్ విద్యార్థులను సీనియర్లు పెద్దన్నల్లా వెన్ను తట్టాలి. చదువుల్లో రాణించేందుకు వారికి దిక్సూచిలా ఉండాలి. అపోహలు పోగొట్టేలా వ్యవహరించాలి. కానీ నేటికీ ర్యాగింగ్ భయం కొత్త విద్యార్థులను వెంటాడుతూనే ఉంది. సీనియర్లు ఎక్కడ మానసిక క్షోభకు గురి చేస్తారోనని జూనియర్లు ఆందోళన చెందుతుంటారు.. హైదరాబాద్, శివారు ప్రాంతాలైన మేడ్చల్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలల తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ, గతంలో జరిగిన ర్యాగింగ్ ఘటనల నేపథ్యంలో ప్రత్యేక కథనం..

మౌనంగా వెళ్లిపోతున్నారు

నగర శివారు ప్రాంతాలో సుమారు 180 వరకు ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి.. ఈఏడాది సుమారు 40వేల మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో చేరారు. దాదాపు అన్ని కళాశాలల్లో ప్రవేశాలు పూర్తవడంతో విద్యార్థులతో కళకలాడుతున్నాయి. వీరిలో చాలామంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఒక్కసారిగా పట్టణ ప్రాంతానికి రావడంతో వారికి అన్నీ కొత్తగా అనిపిస్తున్నాయి. సరికొత్త వాతావరణంలో కొంత భయంగా ఉంటున్నారు. ర్యాగింగ్‌కు గురైనా కళాశాల నిర్వాహకులకు చెప్పలేక పోతున్నారు. ఇక్కడ చదువుకోవడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెపుతున్నారు. దీంతో ఎటూ పాలు పోని వారు తమ పిల్లల ఆందోళన తీర్చేందుకు కళాశాలకు నాలుగేళ్ల ఫీజు మొత్తం చెల్లించి వారి సర్టిఫికెట్లు వెనక్కి తీసుకెళ్లాల్సి వస్తోంది. కళాశాలలో జరుగుతున్న ర్యాగింగ్ విషయం పోలీసులకు చెప్పేందుకు మాత్రం ముందుకు రావడం లేదు. చెబితే విచారణ పేరిట పోలీసు స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందనే కారణంతో వారు మౌనంగా ఉండిపోతున్నారు. సర్కారు కళాశాలల్లో పేద విద్యార్థులు ఎక్కువగా చదువుతుండగా ప్రైవేట్ కళాశాలల్లోనే ర్యాగింగ్ సంబంధిత ఫిర్యాదులు వస్తున్నాయి.



ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం (పాతచిత్రం)

నిరోధం ఎక్కడ..

నిబంధనల మేరకు ప్రతి కళాశాలలోనూ స్థానిక పోలీసు స్టేషన్ నంబర్లు, ర్యాగింగ్ సమాచారం అందించడానికి వీలుగా అక్కడక్కడ ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేయాలి. అవగాహన కల్పించడానికి గోడ పత్రికలు, బ్యానర్లు, కరపత్రాలు ప్రచురించాలి. ప్రతి కళాశాల ఒక మనస్తత్వ నిపుణుడిని అనుసంధానంగా పెట్టుకుని విద్యార్థులకు కౌన్సెలింగ్ తరగతులతోపాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలి. ఇలా పలు నిబంధనలున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. ప్రతి ఏడాది కళాశాలల ప్రారంభ సమయంలో నగరానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ఉమ ఎడ్లపాటి యాంటీ ర్యాగింగ్ పేరిట ప్రచారం నిర్వహిస్తున్నారు. దీని వల్ల విద్యార్థులకు కలిగే నష్టాలపై విద్యార్థులకు వివరిస్తున్నారు. అవగాహన సదస్సులు, ర్యాలీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈఏడాది కూడా ర్యాగింగ్‌తో పాటు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ యంత్ర కళాశాలల్లో ప్రచారం చేస్తున్నారు.

పాల్పడితే శిక్షలు ఇలా..

- హేళన చేసినా, అవమానించినా 6 నెలల జైలు, రూ. 1000 జరిమానా
- బలవంతంగా అవమానకర పని చేయిస్తే ఏడాది జైలు, రూ. 2000 జరిమానా
- బంధించడం, నిర్బంధించడం, గాయపరచడానికి కారణమైతే రెండేళ్ల జైలు, రూ. 5000 జరిమానా
- అపహరణ, అత్యాచారం, అతిగా గాయపరిస్తే ఐదేళ్ల జైలు, రూ. 1000 జరిమానా
- ఆత్మహత్యకు, మృతికి కారణమైతే: 10 ఏళ్లజైలు, రూ. 50 వేలు జరిమానా
- ఆరు నెలలలోపు శిక్షపడితే ఆ కళాశాల నుంచి తొలగిస్తారు. ఆరు నెలల కంటే ఎక్కువైతే ఏ కళాశాలలోనూ చదవకుండా నిషేధిస్తారు.
- ర్యాగింగ్ విద్యాలయాల వెలుపల, లోపల నిషేధం. 1997లో ర్యాగింగ్ నిషేధ చట్టాన్ని సమైక్య రాష్ట్రంలో అమలు చేశారు. నేర తీవ్రతను బట్టి ఆరు నెలల నుంచి జీవిత ఖైదు వరకు విధించవచ్చు. రూ. 1000 నుంచి రూ. 50 వేలు వరకు జరిమానా విధించవచ్చు.
- విద్యార్థులు ఎక్కడైనా ర్యాగింగ్‌కు గురైతే వెంటనే 100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. కంట్రోల్ రూం అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తారు.

రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలోని ఓ యంత్ర కళాశాలలో నల్గొండ జిల్లాకు చెందిన విద్యార్థి ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందారు. సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారని లేఖ రాసి వరంగల్ జిల్లాకు వెళ్లి రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

★ ★ ★

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మరో విద్యార్థి ఘట్‌కేసర్‌లోని ఓ యంత్ర కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరాడు. నెల రోజులకే సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని కళాశాల నుంచి తల్లిదండ్రులు ఉంటున్న మహబూబ్‌నగర్‌కు వెళ్లిపోయాడు. ఆ కళాశాలలో చదవడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెప్పేశాడు. దీంతో వారు కళాశాలకు నాలుగేళ్ల ఫీజు చెల్లించి అతని సర్టిఫికెట్లు వెనక్కి తీసుకెళ్లాల్సి వచ్చింది. ఇవి గతేడాదిలో చోటు చేసుకున్న ఘటనల్లో రెండు ఉదాహరణలు మాత్రమే..

చెల్లెళ్లుగా స్వాగతిస్తాం



- కె.రమ్యరెడ్డి, ఇంజినీరింగ్ సీనియర్ విద్యార్థిని

కొత్త విద్యార్థినులను సొంత చెల్లెళ్లుగా స్వాగతిస్తున్నాం. వారికి ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరిస్తాం. చదువుల్లో ఏవైనా సమస్యలు ఉంటే తీరుస్తాం. కళాశాలలో ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేసుకున్నాం.

ర్యాగింగ్ రహిత కళాశాలగా పేరు తెస్తాం



- ఎస్. లావణ్య, ఇంజినీరింగ్ సీనియర్ విద్యార్థిని

ఇక్కడ ఎలాంటి ర్యాగింగ్ కేసులు నమోదు కాలేదు. ర్యాగింగ్ రహిత కళాశాలగా పేరు తెస్తాం. అదే బాటలో జూనియర్స్ నడిచేలా అవగాహన కల్పిస్తాం. సీనియర్లమంతా జూనియర్లకు కొత్త సబ్జెక్టుల విషయంలో సలహాలు అందిస్తాం.

పరిధిని అతిక్రమించ కూడదు



- ఉమ ఎడ్లపాటి, యాంటీ ర్యాగింగ్ ప్రచార కర్త

విద్యార్థులు కళాశాలలో క్రమశిక్షణతో ఉండాలి. వారు వారి పరిధిని అతిక్రమించకూడదు. అలా చేస్తే విలువైన జీవితాన్ని చేతులారా నాశం చేసుకున్నట్లే, కళాశాల యాజమాన్యాలు ర్యాగింగ్ వంటి అంశాలపై కఠినంగా వ్యవహరించాలి. కళాశాల స్థాయిలో కమిటీలు వేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోకూడదు. ర్యాగింగ్ జరిగితే ధైర్యంగా స్థానిక పోలీసులకుగానీ, 100 నంబరుకు డయల్ చేసిగానీ చెప్పాలి. ఈ నేరానికి చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయి.

సోదర భావంతో మెలగాలి



-డాక్టర్ సుధాకర్‌రావు, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్

కళాశాలలో ఏటా కొత్త, పాత విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేశాం. ఇది మన సంస్కృతి కాదని ప్రతి విద్యార్థికి వివరిస్తున్నాం. ప్రతి నెల రెండు సార్లు వారితో సమావేశం అవుతున్నాం. ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తున్నాం. అవసరమైతే తల్లిదండ్రులను కళాశాలకు పిలిపించి వివరిస్తున్నాం. ఇప్పటి వరకు మా కళాశాలలో ర్యాగింగ్ కేసు నమోదు కాలేదు.

అందం.. మకరందం

వర్షాల వేళ నగరం, శివార్లలోని ఉద్యానాలు, పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. విభిన్న ఆకృతుల్లోని అందమైన రంగు రంగుల సీతాకోక చిలుకల విహారం మానసికోల్లాసాన్ని కలుగజేస్తోంది. పూలపై వాలి మకరందాన్ని గ్రోలుతున్న తీరు ఆకట్టుకుంటోంది. పదుల సంఖ్యలో ఒక్కచోట చేరి కనువిందు చేస్తున్నాయి. ఫొటోగ్రఫీ ప్రియులను ఆకర్షిస్తున్నాయి. వనస్థలిపురం మహావీర్ హరిణ వనస్థలిలోని బటర్‌ఫ్లై పార్కులో, శంషాబాద్ మండలం నర్కుడ-చౌదరిగూడ రహదారి పరిసరాల్లో కెమెరా కంటికి చిక్కాయివి.












మెట్రో స్తంభాలపై తెలంగాణ సంస్కృతి

- రూపుదిద్దుకోనున్న భిన్న కళాకృతులు
- ప్రతి ఐదో స్తంభంపై నిలువుగా ఉండే తోటలు
- వర్ధమాన కళాకారులను ఆహ్వానిస్తున్న హెచ్ఎంఆర్

ఈనాడు, హైదరాబాద్

మెట్రో స్తంభాలు రాబోయే రోజుల్లో కళారూపాలుగా దర్శనమివ్వనున్నాయి. వీటిపై వివిధ కళాకృతులను సృష్టించబోతున్నారు. రహదారికి ఇరువైపులా స్తంభాలపై వర్ధమాన కళాకారులతో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే భిన్న రూపాలను తీర్చిదిద్దబోతున్నారు. మెట్రో పరిసరాల సుందరీకరణలో భాగంగా ప్రతి ఐదో స్తంభంపై వర్టికల్ గార్డెన్ (నిలువుగా ఉండే తోటలు)ను, మిగిలిన స్తంభాలపై కళాకృతులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.





నగరంలో ప్రస్తుతం 66.56 కి.మీ. మేర మెట్రో పనులు జరుగుతున్నాయి. మూడు కారిడార్లలో మియాపూర్ నుంచి ఎల్బీనగర్, నాగోల్ నుంచి హైటెక్ సిటీ, జేబీఎస్ నుంచి ఇమ్లిబన్ వరకు 2531 స్తంభాలను రహదారి మధ్యలో వేశారు. కొన్నింటిని మినహాయిస్తే చాలావరకు జనం నిత్యం ప్రయాణించే మార్గంలో స్తంభాలు కన్పిస్తుంటాయి. వీటిపై ఇప్పటికే రెండువైపులా నిర్మాణసంస్థ ఎల్ అండ్ టీ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసింది. మిగిలిన రెండువైపులా స్తంభాలను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు హెచ్ఎంఆర్ కొన్ని ప్రయోగాలు చేయబోతోంది. ఇవి మెట్రో మార్గానికి మరిన్ని సొబగులు అద్దనున్నాయి.

తీరొక్క రూపాలు..

మెట్రో స్తంభాలను వేర్వేరు కళాకృతుల రూపకల్పనకు వినియోగించనున్నారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, స్మారక చిహ్నాలు, శిలాకృతులు, ప్రకృతి దృశ్యాలు, వన్యప్రాణులు, సంప్రదాయ, ఆధునిక, సమకాలీన అంశాలతో స్తంభాలను అలంకరించనున్నారు.

పునర్వినియోగించేలా..

స్తంభాలపై ఎంపిక చేసిన కళాకారులతో సిమెంట్, మొజాయిక్, సిరామిక్, రాయి, టెర్రకోట, నిరుపయోగమైన వస్తువులు, ఫైబర్‌గ్లాస్ వంటి వివిధ మాధ్యమాలతో కళాకృతులను సృష్టించవచ్చు.

తోటలు కూడా..

మెట్రో మార్గంలో ప్రతి ఐదో స్తంభంపై నిలువుగా ఉండే గార్డెన్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. బెంగళూరు మెట్రోలో ఇప్పటికే ఈ తరహా ఏర్పాట్లతో దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఇలాగే హైదరాబాద్ మెట్రో స్తంభాలపై పచ్చదనం పెంపొందించాలని నిర్ణయించారు. కళాకృతులు దేశంలో ఎక్కడాలేని విధంగా మొదటిసారి మన దగ్గరే రాబోతున్నాయని మెట్రో వర్గాలంటున్నాయి.

ఆలోచనలు పంచుకోవచ్చు..

ప్రతిపాదిత కళాకృతుల రూపాలకు సంబంధించి ఆసక్తి కలిగిన, ఔత్సాహిక కళాకారులు, కళా సంస్థలు తమ ఆలోచనలు సమర్పించాలని హైదరాబాద్ మెట్రోరైలు ఎం.డి. ఎన్వీఎస్ రెడ్డి కోరారు. ఎంపికైన కళాకారులకు, కళా సంస్థలకు వారి ఖర్చులు, పనితనానికి అనుగుణంగా సహేతుకమైన పారితోషికం చెల్లిస్తామని తెలిపారు. దీనిపై మరిన్ని వివరాలకు హెచ్ఎంఆర్ జీఎం రాజేశ్వర్‌ను 8008456866 నంబరులో సంప్రదించవచ్చు.

అమ్మో... బస్సు!



కళాశాలల సమయంలో కొత్తపేటలో విద్యార్థులతో భారంగా వెళుతున్న ఆర్టీసీ బస్సు –మహేశ్, వనస్థలిపురం



ఆర్టీసీకి పట్టదా?

ఆఫీసులు వదిలే వేళ గచ్చిబౌలిలో ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రైవేట్ వాహనాల కోసం నిత్యం వందలాది మంది పడిగాపులు కాస్తుంటారు. వీరంతా ఇక్కడ సగం రహదారిని ఆక్రమించి కనిపిస్తుంటారు. వీరి కోసం ఆర్టీసీ సిటీ బస్సులు నడిపితే మేలు.
–మణికంఠ, శంషాబాద్

స్పందనకు వందనం





ఈ పేదలు గౌరవంగా తినే పరిస్థితి లేదా? అంటూ 'ఈనాడు పౌరపాత్రికేయం' ద్వారా ప్రశ్నించడంతో గ్రేటర్ అధికారులు స్పందించారు. పాతబస్తీ లాల్‌దర్వాజలో రూ.5 భోజన కేంద్రం వద్ద బురద తొలగించి... శుభ్రం చేశారు. స్పందనకు ధన్యవాదాలు.
–వెంకటేశ్, లాల్‌దర్వాజ





అయ్యయ్యో గణపయ్యా..

పండుగ రోజు విక్రయించగా మిగిలిన చిన్నచిన్న వినాయక విగ్రహాలను నాగోలు-ఉప్పల్ మధ్య రహదారి పక్కనే వదిలి వెళ్లారు. వర్షాలకు అవి రహదారిపైనే నిమజ్జనం అవుతూ కనిపించాయి. –పీఎస్ నారాయణరావు, మల్కాజిగిరి; కె.శ్రవణ్‌కుమార్, దిల్‌సుఖ్‌నగర్

ఫుట్‌పాత్‌లూ వదలరే?

ఫతేనగర్ ఫ్లైఓవర్‌పై వెళుతున్న ద్విచక్ర వాహన చోదకులు. ఇదిక్కడ నిత్యకృత్యంగా మారింది. –రామకృష్ణ, ఫతేనగర్



పౌర పాత్రికేయం

మీ చేతిలో సెల్‌ఫోన్ ఉందా? ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్న అంశాలను, విభిన్నమైన చిత్రాలను క్లిక్ మనిపించారా? మీ పేరు, ప్రాంతం తదితర వివరాలతో మీరూ 'ఈనాడు'కు పంపొచ్చు.

వాట్సాప్ నంబరు: 8008001763

దుకాణాలు ఫుట్‌పాత్‌పై... పిల్లలు రోడ్డుపై...

యూసఫ్‌గూడలో కేకే టవర్స్ వద్ద ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయ్యాయి. ఫలితంగా స్కూళ్లకు వెళ్లే చిన్నారులు ప్రమాదకరంగా రోడ్డుపై బడి బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.
–బి.రాము, మధురానగర్



భూమి పూజ చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

– మంత్రి, మహేందర్‌రెడ్డి

బాలాపూర్: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు పడకగదుల ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టారని, ధనవంతుల ఇళ్లు మాదిరిగానే వీటిని నిర్మించనున్నామని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బాలాపూర్ మండలం మల్లాపూర్ రెవెన్యూ పరిధిలోని 73 సర్వే నంబరులోని 15 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.234 కోట్లతో నిర్మించనున్న 2,700 ఇళ్లకు ఆయన బుధవారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ సీఎం చెప్పినట్లుగా జీహెచ్ఎంసీ పరిధిలోని పేదలకు లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని, అందులో భాగంగా ఇక్కడ రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రూ.70వేల కోట్లతో రంగారెడ్డి జిల్లాలో పెద్ద ఎత్తున కంపెనీలు రాబోతున్నాయన్నారు. రూ.2 వేల కోట్లతో గ్రామీణ ప్రాంత ప్రజలకు, రూ.1900 కోట్లతో జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రజలకు నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న ప్రాంతాలకు కూడా నీటిని అందించేందుకు రూ.600 కోట్లతో ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు ప్రణాళిక పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌గౌడ్, నగర పంచాయతీ ఛైర్మన్ సామ నర్సింహగౌడ్, వైస్ ఛైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, ఎంపీపీ తీగల విక్రమ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఐ.యాదయ్య, వి.ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ బి.జగన్‌రెడ్డి, కార్పొరేటర్ అనితాదయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణహితంగా పరిశ్రమలు కొనసాగాలి

– సీఐఐ సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తల మాట



ప్రసంగిస్తున్న మెహతా

మాదాపూర్ న్యూస్‌టుడే: పర్యావరణ హితంగా పరిశ్రమలు కొనసాగాలని.. విద్యుత్, నీరు వంటి వనరులను పొదుపుగా వినియోగించుకునేందుకు అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు పారిశ్రామిక వేత్తలు పేర్కొన్నారు. బుధవారం సీఐఐ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 16వ ఎనర్జీ ఎఫిషియన్సీ సమ్మిట్‌ను ప్రారంభించారు. పేపర్‌టెక్, గ్రీన్ షుగర్ సమ్మిట్, పవర్‌ప్లాంట్ సమ్మిట్‌ల పేరిట కాగితం, చక్కెర, విద్యుత్ పరిశ్రమలకు సంబంధించి వేర్వేరు అంశాలపై చర్చించారు. 150 కంపెనీలనుంచి వచ్చిన ప్రతినిధులు ఆయా అంశాలపై సదస్సులో పత్రాలను సమర్పించారు. ముఖ్యంగా కాగితం పరిశ్రమలో వస్తున్న మార్పులు, పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిపై ఇండియన్ పేపర్స్ మాన్యుఫ్యాక్చర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎ.ఎస్.మెహతా కీలక ప్రసంగం చేశారు. పర్యావరణ పరంగా వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు కాగితం పరిశ్రమలు మెరుగైన విధానాలను అవలంబించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో షుగర్ టెక్నాలజీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంజయ్ అవస్తి, టాటా పవర్ కంపెనీ చీఫ్ సీటీడీఎస్ ప్రవీణ్, పేపర్‌టెక్ ఛైర్మన్ కాశీవిశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

నెదర్లాండ్స్‌లో రహదారి భద్రత కోర్సు

– ఎంపికైన మేడ్చల్ డీటీవో డాక్టర్ పుప్పాల శ్రీనివాస్



డాక్టర్ పుప్పాల శ్రీనివాస్

పేట్‌బషీరాబాద్: నెదర్లాండ్స్‌లో 15రోజుల పాటు నిర్వహించే రహదారి భద్రత కోర్సుకు మేడ్చల్ డీటీవో డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ ఎంపికయ్యారు. ప్రపంచ దేశాల్లో రోడ్డు ప్రమాదాలు నివారించటానికి నెదర్లాండ్స్‌లోని డెల్ఫ్ట్ యూనివర్సిటీ కృషి చేస్తోంది. ఈ యూనివర్సిటీ ప్రతిఏటా ప్రపంచదేశాల్లో రహదారి భద్రతకు కృషి చేస్తున్న వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతుంది. ప్రతి ఏటా 20 మందిని ఈ కోర్సుకు ఎంపిక చేస్తారు. అక్కడ నేర్చుకుని తిరిగి సొంత దేశాల్లో ప్రమాదాల నివారణకు మరింత కృషి చేయాల్సిఉంటుంది. ఇందులో అవకాశం లభించినందుకు 5 వేల యూరోలు అంటే భారత కరెన్సీ ప్రకారం రూ.4.5 లక్షలు అందిస్తారు. మన దేశం నుంచి ఈసారి ఇద్దరు ఎంపికయ్యారు. ఒకరు బెంగళూరు నుంచి కాగా మరొకరు మేడ్చల్ డీటీవో డాక్టర్ పుప్పాల శ్రీనివాస్. ఈయన తెలంగాణ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రహదారి భద్రతపై వందల సంఖ్యలో సదస్సులు నిర్వహించి, వాహనదారుల్లో చైతన్యం తెచ్చారు. సెప్టెంబరు 1న నెదర్లాండ్స్ బయలుదేరి వెళ్తున్నారు.

ఇస్తావా.. చస్తావా?



- హెచ్ఎండీఏలో లంచావతారాలు
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు నరకం
- అడిగినంత ఇస్తే సరి.. లేదంటే కాళ్లరిగేలా తిరగాల్సిందే

హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పేరు చెబితేనే భూ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుదారులు జంకుతున్నారు.. ఎంతలా అంటే ఒకటికి రెండుసార్లు జేబుల్ని తడిమి చూసుకొంటున్నారు. ఎందుకంటే సంస్థ సిబ్బంది ముప్పుతిప్పలు పెడుతున్నారు.. అదిలేదు.. ఇదిలేదంటూ కాళ్లరిగేలా తిప్పుతూ నరకం చూపిస్తున్నారు. అడిగినంత ఇస్తే మాత్రం ప్రభుత్వ భూముల్నీ క్రమబద్ధీకరించేస్తున్నారు. కొరడా ఝుళిపించాల్సిన ఉన్నతాధికారులేమో అంతా ఒప్పంద ఉద్యోగులపై వదిలేసి చోద్యం చూస్తున్నారు.

ఈనాడు, హైదరాబాద్

హెచ్ఎండీఏ పరిధిలో వేలకొద్దీ అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. కొందరు రియల్టర్లు అరచేతిలో స్వర్గం చూపించి.. అనుమతుల్లేని ప్లాట్లను అమాయకులకు అంటగట్టి మోసం చేశారు. వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం పలుమార్లు అవకాశం కల్పించింది. సుమారు 1.7లక్షల దరఖాస్తులు హెచ్ఎండీఏకు అందాయి. ఏడాదిన్నరకు పైగానే అవుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది జులై నాటికి పూర్తి చేస్తామని హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు గతంలో చెప్పారు. ఈ నేపథ్యంలో వేలాది మంది తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అసలు ఈ కసరత్తు ఎప్పటికి పూర్తవుతుందో ఉన్నతాధికారులే చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ఇస్తారా.. చస్తారా..!

'నా ఎల్ఆర్ఎస్ దరఖాస్తును పరిష్కరించమని ఓ అధికారి దగ్గరికి వెళ్లాను. పత్రాలన్నింటిని పరిశీలించి రూ.25వేలు ఇస్తే ... వారం రోజుల్లో చేసి పెడతానన్నారు. లేకపోతే ఏళ్లు గడిచినా అక్కడే ఉంటుందని స్పష్టం చేశారు. నువ్వు ఈ విషయం ఎవరికి చెప్పినా పర్వా లేదు.. కానీ.. డబ్బులు మాత్రం ఇవ్వాల్సిందే' అని ముఖం మీదే చెప్పేశారని కీసర మండలానికి చెందిన ఓ దరఖాస్తుదారుడు 'ఈనాడు'తో వాపోయారు. డబ్బులు ఇవ్వలేమని చెబితే.. ఆ కాగితం కావాలి.. ఈ కాగితం కావాలంటూ ఏదో ఒక వంకతో పదేపదే తిప్పుతున్నారని మరో దరఖాస్తుదారు ఆవేదన వ్యక్తం చేశారు. నిరభ్యంతర పత్రాలు, నీటిపారుదల శాఖ పత్రాలంటూ పెండింగ్ పెడుతున్నారు. ఇక క్షేత్రస్థాయి పరిశీలనకు రావాలంటే ఒక రేటు.. వచ్చాక అంతా సక్రమమేనని రాయాలంటే ఇంకొంత చెల్లించుకోవడంతో పాటు రాచమర్యాదలు చేయాల్సి వస్తోందని ఘట్‌కేసర్ మండలానికి చెందిన ఇంకో బాధితుడు వివరించారు. తెల్లాపూర్‌లోని ప్రభుత్వ స్థలం తమదంటూ కొంతమంది దరఖాస్తు చేస్తే వాటికీ అధికారులు ఎల్ఆర్ఎస్ చేశారు. ఇలా అనేక ప్రభుత్వ స్థలాలకు కాళ్లు వస్తున్నాయి.

ఒక్కో రకం..!

ఒక ప్రణాళికాధికారి (పీవో).. ఈయన పేరు చెబితే .. దరఖాస్తుదారులు భయపడతారు. లేనిపోని కొర్రీలు పెట్టి.. చివరకు తనకు కావాల్సింది వసూలు చేస్తారు. ఇంకొకరేమో ఫలానా వ్యక్తిని కలవండి అంటూ మెల్లిగా చెబుతారు. ఆ ఫలానా వ్యక్తి ఎవరో కాదు.. దళారి. అడిగినంత అందగానే సదరు దళారి ఫోన్ చేసి ఓకే సర్ అంటూ చెప్పగానే ఇక్కడ పని అయిపోతుంది. ఒప్పంద ఉద్యోగులదైతే అంతా బహిర్గతమే. యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ, శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే భూముల్నీ క్రమబద్ధీకరించేస్తున్నారు.

పట్టించుకొంటేగా..!

ఉన్నతాధికారులు ప్రతిరోజు ఎన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యాయో చూస్తున్నారేగానీ.. సిబ్బంది వసూళ్ల వ్యవహారంపై దృష్టి సారించడం లేదు. అలాగని వారికి తెలియదా అంటే అన్నీ తెలుసు. ఎవరైనా గట్టిగా ఫిర్యాదు చేస్తే ఒప్పంద ఉద్యోగులపై చర్యలు తీసుకొంటున్నారు. శాశ్వత ఉద్యోగుల వైపు కన్నెత్తి చూడటం లేదు. దళారుల్ని తరిమికొట్టామంటూ గతంలో గొప్పలు చెప్పారు. కానీ.. పరిస్థితి గతంతో పోలిస్తే ఇంకా దారుణంగా తయారైంది. వారి హవా అంతాఇంతా కాదు.

అస్తవ్యస్తంగా బృహత్తర ప్రణాళిక

హెచ్ఎండీఏ బృహత్తర ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్) అస్తవ్యస్తంగా మారింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులను చుక్కలను చూపిస్తోంది. ఇదీ ఒకరకంగా వసూళ్లకు కారణమవుతోంది. కొంతమంది దరఖాస్తుదారుల స్థలం సంబంధిత సర్వే నంబరులో లేదని మరో సర్వే నంబరులో ఉందని ఒకసారి కొర్రీ వేశారు. ఇది మాస్టర్‌ప్లాన్ తప్పని తేలడంతో అక్కడి నుంచి దరఖాస్తులు ముందుకు కదలినా తర్వాత ఇవే స్థలాలు పరిశ్రమల జోన్‌లో ఉన్నాయని మళ్లీ అభ్యంతరం చెప్పారు. ఇలా వేలాది దరఖాస్తులను అధికారులు నిల్పివేశారు. పరిశ్రమల జోన్ అన్నదీ మాస్టర్ ప్లాన్‌లో దొర్లిన తప్పేనని అధికారులు తేల్చి... దీని నుంచి మినహాయింపు ఇవ్వమని ప్రభుత్వానికి దస్త్రం పంపిస్తే అక్కడి నుంచి అనుమతి రావడం లేదు. ఇలా అనేక ఇబ్బందులతో వేలాదిమంది కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అసహనంతో తమకొద్దు ఈ ఎల్ఆర్ఎస్ అన్న రీతిలో వదిలేసిన వారూ ఉన్నారు. పరిస్థితిని సమీక్షించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన హెచ్ఎండీఏ ఉన్నతాధికారుల నిర్లిప్తతతో దరఖాస్తుదారులు మండిపడుతున్నారు.



వినతి పత్రం ఇస్తున్న టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు

'విద్యాసంస్థల ఆగడాలకు కళ్లెం వేయండి'

నారాయణగూడ, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) రాష్ట్ర అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం బుధవారం మాధ్యమిక విద్య (ఇంటర్) సంచాలకులను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. కొన్నేళ్లుగా కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఎందరో అమాయక విద్యార్థులు ప్రాణాలు పోగొట్టుకున్నారని పేర్కొన్నారు. విద్యాలయాలను జైలుగా మార్చేసి, నియంతృత్వ పోకడలకు పోతూ.. పిల్లలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఇంటర్ మాత్రమే కాదు.. ఐఐటీ, నీట్, ఐఏఎస్‌ల పేరుతో ఒకో విద్యార్థి నుంచి లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాయడం అత్యంత బాధాకరమన్నారు. ఆగస్టు 9న నాగోలులో, 27న మాదాపూర్‌లోని నారాయణ కళాశాలల్లో విద్యార్థి మరణాలను గురించి ప్రస్తావించారు. గతంలోని నీరదారెడ్డి కమిషన్ సిఫారసులను అమలు చేయాలని కూడా టీజీవీపీ కోరింది.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థులు

'కార్పొరేట్' దిష్టిబొమ్మ దహనం

నారాయణగూడ: కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ప్రభుత్వం, నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థల దిష్టిబొమ్మ దహనం చేశారు. తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) ఆధ్వర్యంలో బుధవారం నిజాం కళాశాల నుంచి ఊరేగింపుగా దిష్టిబొమ్మను తీసుకొచ్చి బషీర్‌బాగ్ జగ్జీవన్‌రామ్ విగ్రహం కూడలిలో దహనం చేశారు. టీజీవీపీ నగర అధ్యక్షులు తాడెం రాజేశ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలు ఎక్కువయ్యాయని, విద్యార్థుల ప్రాణాలు బలితీసుకుంటున్నాయని ఆరోపించారు. విద్యాలయాలను కాస్త కేంద్ర కారాగారాలుగా మార్చివేశారని పేర్కొన్నారు. పిల్లలను ర్యాంకులు సాధించే మరమనుషులుగా మార్చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీజీవీపీ నగర ప్రధాన కార్యదర్శి మంజుల, శివకుమార్, ఓయూ అధ్యక్షులు నాగరాజు, టీజీవీపీ నాయకులు కడారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహణం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

'కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోండి'

ఐ.ఎస్.సదన్, న్యూస్‌టుడే: కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువు ఒత్తిడి కారణంగా మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థుల మరణాలను నిరసిస్తూ చంపాపేట చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవికోల్ నరేష్ మాట్లాడుతూ... చదువు పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురిచేసి ఆత్మహత్యలకు కారణమవుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ ఫీజులను వెంటనే అరికట్టాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి స్పందించి విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులైన విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదిహేను రోజుల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ప్రైవేటు విద్యాసంస్థపై చర్యలు తీసుకొని దర్యాప్తు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు అరుణ్, నిఖిల్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపించాలి'

దిల్‌సుఖ్‌నగర్: బాచుపల్లి ప్రగతినగర్ నారాయణ కళాశాల విద్యార్థి నాగసాయికిరణ్ ఆత్మహత్యకు కారకులను శిక్షించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో కొత్తపేట నుంచి చైతన్యపురి వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నారాయణ విద్యాసంస్థల అధిపతి నారాయణ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మర్రి శ్రవణ్ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు ప్రభుత్వం ఎర్రతివాచి పరుస్తున్నారన్నారు.



చైతన్యపురి కూడలి వద్ద కళాశాల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

'తలాక్ కేసును సుప్రీం కోర్టు పునర్విచారించాలి'

మాదన్నపేట: ట్రిపుల్ తలాక్ కేసులో సుప్రీం కోర్టు వెల్లడించిన తీర్పుపై కేసును పునర్విచారించాలని ఆల్ ఇండియా సున్నీ ఉలేమా బోర్డు డిమాండ్ చేసింది. బుధవారం డబీర్‌పురాలో ఆల్ ఇండియా సున్నీ ఉలేమా బోర్డు కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి ట్రిపుల్ తలాక్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా సభ్యులు తీర్మానించిన ప్రతిని మీడియాకు విడుదల చేసింది. తలాక్ విషయంలో సుప్రీం కోర్టు ముస్లిం పర్సనల్ లా బోర్డు అభిప్రాయాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం వల్లే ఈ తీర్పు వచ్చిందని సమావేశంలో సభ్యులు తెలిపారు. ఓయూ విశ్రాంత పర్షియన్ ప్రొఫెసర్ డా. సయ్యద్ మహమ్మద్ తన్వీరుద్దీన్, సున్నీ ఉలేమా బోర్డు అధ్యక్షుడు మౌలానా సయ్యద్ హామిద్ హుస్సేన్ షుత్తారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సమాట్లాడుతున్న ప్రొ.డా.సయ్యద్ మహమ్మద్ తన్వీరుద్దీన్



మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వ్యక్తి.. సంజీవని పేరుతో వినూత్న మొక్కను అమ్ముతున్నారు. మొక్క చిన్నగా ఉన్నా.. నీళ్లలో ఉండగా పెద్దగా విచ్చుకుంటుంది. అలంకరణ కోసం దీనిని వాడుతుంటారు.

'ఔషధ నగరి'లో చిక్కుముళ్లు!



● విప్పేదెవరు.. బాధితులకు న్యాయం జరిగేదెన్నడు?

● నేటి నుంచి గ్రామాల వారీగా రైతులతో చర్చలు


రైతుల నుంచి సేకరించనున్న భూములివే..

యాచారం, న్యూస్‌టుడే

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'ఔషధ నగరి'లో అనేక చిక్కుముళ్లున్నాయి. భూ సేకరణ ప్రారంభించిన మొదట్లో నిర్వాసితులను గుర్తించడంలో సరైన విధానాన్ని ఎంచుకోకపోవడంతోనే అనేక సమస్యలు ఉత్పన్నమైనట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సమస్యలను పరిష్కరించేందుకు నేటి నుంచి గ్రామాల వారీగా భూనిర్వాసితులతో స్థానిక ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సమక్షంలో అధికారులు రైతులతో సమావేశంకానున్నారు. ఆర్డీఓ మధుకర్‌రెడ్డి, తహసీల్దారు పద్మనాభరావు తదితరులు రైతుల వారీగా చర్చించనున్నారు. భూమిపై హక్కుల పరంగా, విస్తీర్ణం పరంగా ఉన్న సమస్యలను పరిశీలిస్తారు. స్థానికంగా పరిష్కారం కాని వాటిని జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లనున్నారు. వచ్చే నెల 18న పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. మరోవైపు విపక్షాలు, పర్యావరణవేత్తలు ఔషధనగరికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. వారికి అవకాశం ఇవ్వకుండా రైతులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. ఔషధనగరికి ఎలాంటి విఘ్నాలు కలుగకుండా చూసే బాధ్యతను ప్రభుత్వం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి అప్పగించింది.

సంప్రదాయాలకు భిన్నంగా..

ఔషధనగరికి కందుకూరు, కడ్తాల, యాచారం మండలాలనుంచి 19వేల ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రం జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్) హోదా కల్పించడంతో 12,500 ఎకరాలకు మించి భూమిని సేకరించడం అనివార్యమైంది. ఇక్కడ భూలభ్యత దృష్ట్యా 19వేల ఎకరాలను సేకరించి ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా అంతర్జాతీయ ఔషధనగరిని నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. భూసేకరణలో ప్రభుత్వ, అసైన్‌మెంట్, పట్టాభూములు ఉన్నాయి. ఇప్పటి వరకు భూసేకరణ జరిగిన ప్రాంతాల్లో ఎక్కడైనా అసైన్‌మెంట్ సర్టిఫికెట్ విస్తీర్ణం మేరకు పరిహారం చెల్లించి భూమిని ప్రభుత్వం తీసుకుంటుగా... ఇక్కడ మాత్రం రైతులు సాగుకు యోగ్యంగా మార్చుకుని పంటలు సాగుచేస్తున్న భూమికే పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. దీనికి సరైన ప్రామాణికం లేకపోవడంతో బడుగు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తరతరాలుగా శ్రమించి భూమిని సాగుకు యోగ్యంగా మార్చుకున్న రైతులు అనేక మందికి పొంతన లేని విస్తీర్ణాన్ని చూపి.. తక్కువ పరిహారం ముట్టజెబుతున్నారు. మరోవైపు సర్టిఫికెట్ లేకున్నా.. అనుభవదారులకు పరిహారం చెల్లించాలనే నిర్ణయంతో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు భూమి ఎక్కడ ఉందో తెలియని వారికి సైతం.. ఏళ్లుగా సాగు చేసుకుంటున్నట్లు పంచనామాలో రాసి పరిహారం చెల్లించారు.

వీటి సంగతి తేలెదెప్పుడో..

● మేడిపల్లిలో 1,830 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇప్పటి వరకు సేకరిస్తే కేవలం 700 ఎకరాలకు మాత్రమే పరిహారం ఇచ్చారు. మిగిలిన భూమిని ఉచితంగా తీసుకుంటున్నారు. కనీసం 80శాతం భూమికైనా పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

● రీసర్వే అనంతరం 160 ఎకరాల భూమికి అదనంగా పరిహారం ఇవ్వాలని అధికారులు తేల్చినా.. అనేక సందేహాల నేపథ్యంలో పరిహారం చెల్లించకుండా ఆరు నెలలుగా రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు.

● మేడిపల్లిలో 210 ఎకరాల పట్టా భూమి పేద రైతులది ఉంది. ఉన్నట్టుండి ఇప్పుడు భూదాన్‌భూమిగా తెరపైకి తేవడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.

● చట్టరీత్యా అసైన్‌మెంట్‌భూమి అమ్మకాలు కొనుగోళ్లు చెల్లవు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా కొన్ని చోట్ల చేతులు మారాయి. ఆ భూముల ఆధారంగా దశాబ్దలుగా పేద రైతులు జీవిస్తున్నారు. ఇప్పుడు వారికి అధికారం లేదని పీఓటీ కింద ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. ఇలా స్వాధీనం చేసుకున్న భూమి మండలంలో 300 ఎకరాల వరకు ఉంది. సర్టిఫికెట్ లేకున్నా సాగు చేసుకుంటున్న వారికి పరిహారం ఇస్తున్నప్పుడు తరతరాలుగా అదే భూమిని నమ్ముకుని ఉన్న వారికి ఎందుకు పరిహారం ఇవ్వరా అని.. రైతులు ప్రశ్నిస్తున్నారు.

అన్యాయం చేశారు

– బైండ్ల బాలరాజు, రైతు, నానక్‌నగర్

50 ఏళ్ల నుంచి మూడు తరాల వాళ్లం కష్టపడి 4 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని సాగుకు యోగ్యంగా మార్చుకున్నాం. ప్రస్తుతం ఆ భూమిలో పత్తి సాగు చేస్తున్నాం. అయితే ఎకరన్నర భూమిలోనే సాగుచేస్తున్నట్లు అధికారులు నమోదు చేశారు. పరిహారం కోసం మూడు నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు.

కలెక్టర్‌కు నివేదిస్తాం



– మధుకర్‌రెడ్డి, ఆర్డీఓ

జహీరాబాద్‌లో 3వేల ఎకరాల భూమిని నిమ్జ్‌కు నా ఆధ్వర్యంలోనే సేకరించాం. ఎక్కడ చిన్న సమస్య రాకుండా భూసేకరణ పూర్తి చేశాం. ఇక్కడ బ్లాలో ఉన్న వారికి పరిహారం చెల్లిస్తున్నారు. దీంతో పలు సమస్యలు ఏర్పడ్డాయి. వాటిని పరిశీలించి పరిష్కరిస్తాం. మేడిపల్లిలో భూదాన భూమిగా చెబుతున్న దానిలో రైతులే సాగు చేసుకుంటున్నారు. దాని పరిహారం ఎవరికి ఇవ్వాలనే దాంతోపాటు పీఓటీ కింద తీసుకున్న భూముల విషయంపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం. కొత్తభూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ జరుగుతోంది.

రైతులకు అన్యాయం జరగనీయం



– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

ఔషధనగరి భూనిర్వాసితుల్లో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగనీయం. ఇబ్రహీంపట్నంలో రక్షణ సంస్థలకు భూసేకరణ జరిగినప్పుడు సైతం పారదర్శకంగా వ్యవహరించాం. ప్రభుత్వం రైతులకు అండగా ఉందనే విషయాన్ని గుర్తించాలి. కొందరు అధికారులు భూసేకరణలో చాలా వ్యవహారం నడిపారు. అలాంటి వారికి శిక్షతప్పదు.


కార్యశాలలో శిక్షణ పొందిన మహిళలు

మహిళలకు ఉచిత ఉపాధి శిక్షణ

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు, ఫ్రీడం రిఫండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బంజారాహిల్స్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ఉచిత ఉపాధి కార్యశాలను నిర్వహించారు. ఫ్రీడం సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. 20 మందికి పైగా అభ్యర్థులు వివిధ ఆహార పదార్థాల తయారీ నేర్చుకున్నారు. శిక్షణ సెప్టెబరు రెండో వారంలో ముగుస్తుందని, ఈ శిక్షణ ఉచితంగా అందిస్తున్నట్లు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు సీఈఓ టి.విష్ణువర్ధన్ తెలిపారు. ఇప్పటికే ఒక బ్యాచ్ ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ మల్లారెడ్డి, కలెక్టర్ ఎంవీరెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రైతుల శ్రేయస్సుకే సమన్వయ కమిటీలు

మేడ్చల్ జిల్లా స్థాయి సమీక్షలో మంత్రి మహేందర్‌రెడ్డి

కీసర: వచ్చే సంవత్సరం నుంచి రైతులకు ఎరువులకు పెట్టుబడి నిమిత్తం ఎకరానికి రూ.4 వేల నగదును అందిస్తున్నామని, ఇందుకోసం రైతు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైతు సమన్వయ సమితుల ఏర్పాటు, బతుకమ్మ చీరల పంపిణీ, మిషన్ భగీరథపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు ఒకటి నుంచి 9వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో రైతు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమన్వయ కమిటీల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కమిటీల్లో 30 శాతం మహిళా రైతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రూ.3 వేల కోట్ల వ్యయంతో అనుకున్న దానికంటే ముందుగానే సెప్టెంబరు నెలాఖరుకు ఇంటింటికి నల్లాల ద్వారా మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిషన్ కాకతీయలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేశామన్నారు. దసరా పండుగ కానుకగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడపడుచుకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా.ఎం.వి.రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 15,926 మంది రైతులు సాగు చేస్తున్నట్లు సమగ్ర సర్వేలో తేలిందన్నారు. బతుకమ్మ చీరల పంపిణీకి జిల్లాలో 6 లక్షల 4 వేల 15 మంది మహిళలను అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. మిషన్ భగీరథ కింద ముందుగా జిల్లాలో 98 గ్రామాలకు మంచినీరు అందిస్తున్నామన్నారు. బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా మేడ్చల్‌ను ప్రకటించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ సీహెచ్.మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు ఎం.సుధీర్‌రెడ్డి, వివేకానంద, గాంధీ, ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జేసీ ధర్మారెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమాస్తుల కేసులో అధికారికి అరదండాలు

ఈనాడు, హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో ఓ అధికారికి జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం మంగళవారం తీర్పు ఇచ్చింది. ఆ సొమ్మును న్యాయస్థానంలో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఇందుకోసం స్థిరాస్తుల్ని అమ్మేందుకు ప్రభుత్వానికి వెసులుబాటు కల్పించింది. అనిశా విభాగం హైదరాబాద్ సిటీ రేంజ్-1 డీఎస్పీ జె.అశోక్‌కుమార్ వివరాల ప్రకారం.. అనంతపురం బాయిలర్స్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ బి.యోగేశ్వరరావుకు అక్రమాస్తుల కేసులో ఏడాది కఠిన కారాగార శిక్షతోపాటు రూ.పది వేల జరిమానా విధిస్తూ హైదరాబాద్ ఏసీబీ కేసుల న్యాయస్థానం ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి కె.శైలజ మంగళవారం తీర్పు వెలువరించారు. జరిమానా కట్టకుంటే మరో రెండు నెలల సాధారణ శిక్ష ఉంటుందని స్పష్టం చేశారు. తన పదవీకాలంలో యోగేశ్వరరావు అక్రమాస్తుల్ని కూడగట్టినట్లు 2002 మార్చి 19న నమోదైన కేసులో విచారణ జరిపిన న్యాయస్థానం ఈమేరకు తీర్పు ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలం సానపల్లి లంకకు చెందిన చెందిన 1973-80 మధ్య కాలంలో రామచంద్రాపురం బీహెచ్‌ఈఎల్‌లో ఇంజినీర్‌గా పనిచేశాడు. అనంతరం ఫ్యాక్టరీస్ విభాగంలో బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సర్వీసులో చేరారు. 1992లో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది 1998 వరకు వరంగల్‌లో, తర్వాత ఏడాదిపాటు హైదరాబాద్‌లో పనిచేశారు. ఆయన అనంతపురంలో పనిచేస్తున్న కాలంలో అక్రమాస్తుల వ్యవహారంలో అనిశా కేసు నమోదు చేసింది. హైదరాబాద్ కేపీహెచ్‌బీలో రెండు భవనాలు, అమీర్‌పేట, అనంతపురం జిల్లా పుట్టపర్తిలో రెండు ఫ్లాట్లు, కేపీహెచ్‌బీ, పటాన్‌చెరు అమీన్‌పూర్‌లలో మరో రెండు ఇళ్లు, అమీన్‌పూర్‌లో ఇంటిస్థలం, తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరంలో వ్యవసాయ స్థలాలు అక్రమంగా సంపాదించినట్లు గుర్తించారు. అతడితోపాటు కుటుంబసభ్యుల పేర్లపై ఉన్న బ్యాంకు ఖాతాల్లో అక్రమంగా నగదు జమ చేసినట్లు తేల్చారు. రూ.46,48,268 అక్రమాస్తులున్నట్లు 2006లో అభియోగపత్రం దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

ప్రయాణం.. కావొద్దు ప్రమాదం



ఆర్టీసీ బస్సులో విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ఈ దృశ్యం బుధవారం ట్యాంక్‌బండ్ వద్ద కనిపించింది. బస్సు ఫుట్‌పాత్‌పై బయటకు వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులకు కొంతదూరం నుంచి ఆటో వెళ్లడంతో ప్రమాదం తప్పింది.